పునర్ముద్రిత లఘు గ్రంథాలు

ప్రపంచ తెలుగు మహాసభలు

27 - 29, డిసెంబరు, 2012

తెలుగు-ఉత్తర భారత సాహిత్యాలు

రచన

డా. భీమసేన్ నిర్మల్

శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

తెలుగు - ఉత్తరభారత సాహిత్యాలు

డా. భీమసేన్ నిర్మల్
శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తి

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

తెలుగు - ఉత్తర భారత సాహిత్యాలు

రచయిత : డా. భీమసేన్ నిర్మల్

శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తి

Telugu - Uttara Bharata Saahityaalu
Writer : Dr. Bheemsen Nirmal
Sri Earvanti Krishna murthy

ISBN : 81-86073-358-1

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య: 500

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ప్రథమ ముద్రణ : **ఏప్రిల్, 1975**
ద్వితీయ ముద్రణ : **డిశంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

ముద్రణ : **శ్రీసాయి ప్రోసెస్, నారాయణగూడ,** హైదరాబాదు

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్జ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899

ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభలసందర్భంగా ముద్రించిన డా. భీమసేన్ నిర్మల్, శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తిగారి "తెలుగు-ఉత్తర భారత సాహిత్యాలు" అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కె.ఆశీర్వాదంగారికి, ఆచార్యసి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

ముందుమాట

ఎన్నో ఏళ్ళుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వసమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధులందరిని ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్న కలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండు వేల అయిదు వందల సంవత్సరాల తెలుగుజాతి చరిత్రలో మరపురాని మధురఘట్టము కాగలదు.

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలం నుండి తెలుగు ప్రజలకు విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారతదేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడేవారి తరువాతి స్థానం తెలుగువారిది. బౌద్ధ పూర్వయుగం నుంచి ఇటీవల బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్ద ఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్ళడం జరిగింది. అట్లా వెళ్ళిన తెలుగువారు తమ భాషా సంస్కృతి సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ వున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదిక మీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషిని గూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికీ, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖం చేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావ సమైక్యతకు ప్రాతిపదికలై తెలుగుజాతిని సమైక్యం చేయగలవనీ, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన, తెలుగు ఉగాది రోజున, ప్రారంభమై ఒక వారం రోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాల నుంచీ, వివిధ రాష్ట్రాల నుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థల నుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో

చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాల నుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగు వారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను విశదం చేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజల భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘన విజయాలను విశదం చేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదం చేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడం లేదు. చేయవలసినది ఇంకా యెంతో వుంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకోవడమేకాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు

అధ్యక్షులు

ప్రపంచ తెలుగు మహాసభలు

పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్ధమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగుదేశపు నలుచెరగుల పరిచితము చేయు సంకల్పముతో 1975 వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయేగాక, ప్రపంచములోని వివిధ దేశాలలో నివసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాదున జరుగునటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వాన సంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగంవెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు. విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు దాని కార్యనిర్వాహకాధ్యక్షులు, ఆర్థికమంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్రభాషా, సాహిత్య, కళా, చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వహణకై 44 మంది సభ్యులు కల ఒక విద్వత్ సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్సంఘము ఆ లఘు గ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆయారంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ యెన్నుకొనినది. ఈ విధముగా సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింపవలసినదిగ ప్రపంచ తెలుగుమహాసభా కార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు అకాడమీని కోరిరి. మహాసభా సఫలత

కొరకై కృషిచేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించినది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ **తెలుగు 'ఉత్తర భారత, సాహిత్యాలు'** అను గ్రంథమును, రచించిన డా. భీమసేన్ నిర్మల్, శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తి ఆంధ్ర పాఠకలోకమునకు సుపరిచితులు. వారికి వేము కృతజ్ఞతాబద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన శివాజీ ప్రెస్ వారికి మా కృతజ్ఞత.

దేవులపల్లి రామానుజరావు

కార్యదర్శి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

తెలుగు-ఉత్తర భారత సాహిత్యాలు

I

జనం విభ్రతీ బహుధా వివాచనం నానాధర్మాణం పృథ్వీయథౌకసమ్ ।
సహస్రం ధారా ద్రవిణస్య మే దుహాం ధ్రువేవ ధేనురనపస్ఫురంతీ ॥

(అ.కా 120 సూ 1. గం 45)

ప్రాచీనకాలంలోని కవులకు తమతమ కావ్యాలలో భరతఖండంలో ఉండే ఛప్పన్న దేశాలనుగురించి అడపాదడపా ప్రస్తావించడం పరిపాటిగా ఉండేది. మహారాజుల పట్టాభిషేక సమయములోనో లేక వారి యుద్ధసంరంభ సందర్భంలోనో వారు ఆయా దేశాల రాజులు వచ్చారని వర్ణించడం కద్దు. అంటే ఆ రోజుల్లో భారతదేశం 56 రాజ్యాలుగా విభక్తమై ఉండేదన్నమాట. ఈ రాజ్యాలన్నీ సర్వ స్వతంత్రమైన రాచరికం కలిగి ఉండేవి. అయితే బలశాలి అయిన ఎవరో ఒకరాజు అశ్వమేధమో, దిగ్విజయమో చేసి చక్రవర్తి ననిపించుకునేవాడు. ఆ చక్రవర్తిత్వం కూడా తాత్కాలికమైందిగానో, నామమాత్రంగానో ఉండేది.

కాని రాజకీయంగా సమస్తదేశం ఈ విధంగా విభక్తమై ఉన్నా, సాంస్కృతికంగా అవిభక్తంగా ఉండేది. సంస్కృతి, మతం, వాఙ్మయం మొదలయినరంగాలలో మనదేశం అవిభక్తంగా ఉండేదనడానికి ఆధారాలు చాలా కనిపిస్తున్నవి. పుణ్యనదులు, పుణ్యతీర్థాలు, మతపీఠాలు మొదలయినవి దేశం నలుమూలలా వ్యాపించి ఉండి, దేశాన్ని ఏకసూత్ర నిబద్ధం చేశాయి. కాశీ గంగా జలాన్ని రామేశ్వరం వద్ద సాగరంలో కలిపి, రామేశ్వరంలోని ఇసుకను కాశీ గంగలో కలిపితేనే యాత్ర పరిపూర్ణమవు తుందనే విశ్వాసం దేశసమైక్య భావాన్ని నిరూపించేదే. ఆదికవి శ్రీరాముడి శీలాన్ని వర్ణిస్తూ-

సచ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః
సముద్ర ఇవగాంభీర్యే ధైర్యేణ హిమవానివ ।

(భా. ప్రథమసర్గ. శ్లో 17)

అని అతని గాంభీర్యాన్ని సముద్రంతోను, ధైర్యాన్ని హిమాలయంతోను పోల్చి, దేశ సమగ్ర స్వరూపాన్ని వ్యంగ్యంగా సూచించాడు. ఒక వ్యక్తి శీలాన్ని వర్ణించడంలో దేశానికి దక్షిణాన ఉన్న సముద్రాన్ని, ఉత్తరాన ఉన్న హిమాలయాలను ఉట్టంకించడం, ఈ సమస్తదేశం ఒకటేనని, అఖండమని వ్యంజించడమే. ఇలా వ్యంజనారూపంలో కాకుండా, సమస్త దేశాన్ని వర్ణించిన ప్రసంగాలు సంస్కృత సాహిత్యంలో కోకొల్లలు.

ఈ భావాన్నే విశదీకరిస్తూ డాక్టరు పరమాత్మశరణ్, (ఎం.ఏ., పిహెచ్.డి., ఎఫ్. ఆర్. హెచ్. ఎస్ (లండన్), ఇలా అన్నారు.

"సమైక్యం ఆధారంగా వికసించిన వైవిధ్యాన్ని, అనేకత్వాన్ని గుర్తించిన మహనీయులు ప్రాచీన భారతీయులు. మానవస్వభావ సూచకమైన ఈ యథార్థాన్ని ప్రప్రథమంగా అవగాహన చేసుకున్నది కూడా భారతీయులే. విశిష్టమైన ఈ సమైక్య భావాన్ని భారతీయులే పెంపొందించుకున్నారు. ఇది వారి ప్రత్యేకత"[1]

బాహిరంగా కనిపించే విభిన్న లక్షణాల వెనక ఆంతరంగికంగా నిక్షిప్తమై ఉన్న ఏకత్వం, అభిన్నత విదేశీయులకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చును. ఈ విషయాన్ని ఉట్టంకిస్తూ పండిత జవహర్‌లాల్ నెహ్రూగారు ఇలా వ్రాశారు

'and yet underneath all this there is an Indianness which distinguishes every part of India and is something unique and deeper than the external differences that may strike the casual observer. India is a curious mixture of amazing diversity and abiding unity.'[2]

(భారతదేశంలోని ప్రత్యంశంలోనూ, నిక్షిప్తంగా ఉన్న విలక్షణ భారతీయత్వం, సామాన్యుడికి కొట్టవస్తున్నట్లు కనిపిస్తున్న బాహిరభేదాలకంటే ప్రగాఢమైనదీ,

విశిష్టమైనదీ. ఆశ్చర్యకరమైన వైవిధ్యాల విచిత్ర సమ్మేళనాన్ని, ప్రకృష్టమైన సమైక్య స్ఫూర్తిని భారతదేశం ప్రదర్శిస్తుంది.)

సాంస్కృతికంగాను, మతపరంగాను అభివ్యక్తమయిన సమైక్య దృక్కోణం భారతీయ వాఙ్మయంలో, అనేక రూపాలలో మనకు సాక్షాత్కరిస్తుంది.

సంకుచిత మనస్తత్వానికి స్వస్తిచెప్పిన మనీషు లెందరో తమకు అనేక భాషలలో అభినివేశం ఉందని, ఆయాభాషలలో తమకున్న పాండితీగరిమ తమకు గర్వ కారణమని చెప్పుకున్నారు.

హిందీ భాషకు ఆదికవి అయిన చంద్‌బర్దాయి 'పృథ్వీరాజ్‌రాసో' అనే మహాకావ్యంలో తనని గురించి వ్రాసుకుంటూ, తాను 'షట్‌భాషా' ప్రవీణుణ్ణని చెప్పుకున్నాడు[1]. అదేవిధంగా వాగనుశాసనుడయిన నన్నయభట్టారకుడు తన సహాధ్యాయి అయిన నారాయణభట్టు సంస్కృత, ప్రాకృత, పైశాచిక, ఆంధ్ర, కర్ణాట భాషా కవిరాజ శేఖరుడని వ్రాశాడు[2]. శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణకవి మొదలయినవారు తాము ఎన్నెన్నో భాషలలో ప్రవీణులమని వ్రాసుకున్నారు. దగ్గుపల్లి దుగ్గన శ్రీనాథుణ్ణి 'సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య భాషాపరిజ్ఞాన పాటవంబు[3]' కలవాడని కొనియాడాడు. భీమఖండ కృతిపతి అయిన బెండపూడి అన్నమంత్రి అరబీ భాష, తురుష్కభాషలందు ప్రవీణుడనీ, పారసీలో వ్యవహారం కొనసాగించడానికి సామర్థ్యం కలవాడని శ్రీనాథుడు వర్ణించాడు[4]. పొన్నికంటి తెలగనార్యుడు తన కృతిభర్త అయిన అమీన్‌ఖాను సంతానంలో గతాల్‌ఖాను అనునతడు అరబీ, పారశీ, గుజరాతి,

---

1. 'The basic truth of the nature of human society which was from the very first realised by these ancients was the recognition of diversity and multiplicity both flourishing on the bed-rock an underlying unity, a unique oneeness which has been characteristic of the Indian people since ages unknown'.

   'The Preservation and strenthening of the cultural synthesis Effected idn India since Medieval times'(p-5)-National Integration Publication Series I. published by The Institute of Indo-Middle East Cultural studies, Hyderabad-1967.

2. As quoted by Dr.P.Saran in his essay, p.7.

ఆరె, అచ్చతెనుగు, కన్నోజి మొదలయిన భాషలు తెలిసి, వ్రాయగలిగిన వాడని వర్ణించాడు[5].

అనేక భాషలు నేర్చుకొని, పరభాషాసహనం కలిగి ఉండడం ఆనాటి కవి పండితుల విశిష్ట లక్షణమని నిస్సందేహంగా చెప్పవచ్చును. కవి పండితుల మాటకేమి, సామాన్య ప్రజానీకమూ, ఆనాడు బహుభాషాభినివేశం, బహుభాషా ప్రియత్వం, సమగ్ర వ్యక్తిత్వానికి చిహ్నమని, అలంకార ప్రాయమని భావించేది, చతుష్షష్టికళలలో అన్యభాషా పరిచయం కూడా ఒకకళగా వన్నెకెక్కింది. ఉదాహరణకు పాల్కురికి సోమనాథుని (12వ శతాబ్దం) 'వృషాధిప శతకం'లో మణిప్రవాళ శైలిలో రచించబడిన కొన్ని పద్యాలు మచ్చుకు ఉట్టంకిస్తాము.

ఉ. 'హృన్నలినే స్మరామి భవదీయ పదద్వితయం భవాటస
స్విన్న తమశ్రమాపహ మశేష జగత్ప్రణుతం మదీశ ని
ష్పన్న దయానిధే యనుచు, సంస్కృత భాష నుతింతు నిన్ను వి
ద్వన్నుత నామధేయ బసవా ! బసవా ! బసవా ! వృషాధిపా.

చ. పరమనె యెన్న యీాండవనె పన్నుదయానె యనాదనాదనే
పెరియనె పేరివుండవనె, పేరుదయాయనె, పేరుజెప్పనే
తరిమురి యాయనే యనుచు ద్రావిడ భాష నుతింతు నిన్ను మ
ద్వర కరుణా విధేయ బసవా ! ... ...

చ. హసుళెయరెన్న రక్షిసువు దారయవెన్న వనీత నెందు మ
న్ని సువుదు నిమ్మడింగెరగ నిమ్మప్రసాదియె నిమ్మదాత్మనే

---

1. 'ఉక్తి ధర్మ విశాలస్య రాజనీతి నవంరసం ।
షట్ భాషాపురాణం చ కురానం కథితంమయా ॥ (సమయ 1 - రూపకం 38).

2, నందంపూడిశాసనం.

3. నాసికేతోపాఖ్యానము.

4. భీమఖండం. 1-72, 74

5. యయాతి చరిత్ర. 1-41

కసిగతి యంచు భక్తి నిను గన్నడభాష నుతింతు షడ్గుణ
శ్వసన పురాతనాత్మ బసవా ! ... ...

ఉ. దేవపరీతుమీ్వ్చ గురుదేవమణూను తరీతుమీ్వ్చ గో
సా వితరీతుమీ్వ చ తుమచాచ ప్రసాదచమీ్వ కృపాకరా!
హేవరదా యటంచు నుతియించెద నిన్నును నారెభాస దే
వా వినుతార్య లీల బసవా ! ... ...

చ. అనయము జేతులందు భవదంఘ్రి సరోజ యుగం నమామి నె
మ్మనమున సంస్మరామి యను మాటల నిన్ వరివస్కరోమ్యహ
మ్మనుచు మణి ప్రవాళమున నంకన సేయుదు భక్తలోక హృ
ద్వనజ విహారలోల బసవా ! ... ...

(భక్తిరస శతకసంపుటము: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1926)

ఇతర భాషలను నేర్చుకొని ఉండడం, యథానుకూలంగా వాటిని తమ కావ్యరచనకు ఉపయోగించుకోవడమే కాకుండా, ఇతరభాషల వైశిష్ట్యాన్ని, మాధుర్యాన్ని కూడా ఆనాటివారు కంఠోక్తిగా ప్రశంసించేవారు. తమిళం మాతృభాషగా కలిగి, సంస్కృతంలో సుప్రసిద్ధ పండితుడు, రచయిత అయిన అప్పయ్య దీక్షితులు ఆంధ్రత్వాన్ని, ఆంధ్రభాషా గౌరవాన్ని అద్వితీయంగా పొగిడాడు[1]. అది ఆనాటివారికి ఇతర భాషాసాహిత్యాల పట్లగల సమాదర భావాన్ని సూచిస్తుంది.

ఈ విధంగా ఇతర భాషలపట్లను, ఇతరుల ఆచార వ్యవహారాలపట్లను, నాటి భారతీయులు పెంపొందించుకున్న సౌహార్ధభావమే, వారిని సాంస్కృతికంగా ఒకే దేశ ప్రజలుగా తీర్చి దిద్దగలిగింది. నాటి ప్రజా జీవితాన్ని మత సంస్కృతులు తీర్చి దిద్దినట్లుగా, రాజకీయాలు తీర్చి దిద్దలేకపోయినవి. రాజకీయ వ్యవహారం హృదయాలను విడదీస్తుంది. సాహిత్యం ప్రజాహృదయాలను సమీకరిస్తుందనే యాథార్థ్యానికి భారతీయ ఇతిహాసం సాక్షీభూతం'.

1. 'ఆంధ్రత్వ మాంధ్రభాషాచ నాల్పస్యతపసః ఫలమ్'.

ఈ విధమైన సుహృద్భావ వాతావరణంలో మనదేశంలోని ఎన్నో భాషలు సాహితీ మర్యాదలను సంతరించుకొనగలిగినవి. అయితే ఈ భాషల్లో చాలామటుకు సంస్కృత భాషా-సాహిత్యాల ఆధారంగా వికసించినవే. ఆనాటి విద్వాంసులు సంస్కృతభాషా-సాహిత్యాలలో పారంగతులయి, ఆ విజ్ఞానాన్ని ప్రాంతీయభాషల ద్వారా ప్రజానీకానికి అందిస్తూ ఉండేవారు. భారతీయ భాషలన్నింటిలోను వ్యాకరణం, సాహిత్యశాస్త్రం-రెండూ సంస్కృతం ఆధారంగా ఏర్పడ్డవే. సాహిత్యశాస్త్రమయితే, ఏ భాషలోనూ మౌలికంగా ఇప్పటికీ లేనేలేదు. వాఙ్మయ వికాసానికి సంస్కృతరచనలే మూలకందాలు. ఇలా భారతీయభాషా - సాహిత్యాలన్నిటిని ఏక సూత్రబద్ధం చేసిన గౌరవం సంస్కృతానికే దక్కింది. సాహితీబంధువులయిన డా. బెజవాడ గోపాలరెడ్డిగారు అన్నట్లు 'భారతీయభాషలన్నీ, వివిధవర్ణాలతో విలసిల్లుతున్న కమనీయకుసుమాలు. వాటినన్నింటిని హారంగా తయారుచేసింది సంస్కృతసూత్రం'. హారం తయారయిన తరవాత దారం మన కంటికి కనిపించదు. అదేవిధంగా భారతీయ సాహిత్యంలో సంస్కృతం అంతర్వాహినిగా ఉన్నదనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

అయితే సంస్కృత సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో వారూవీరనక సమస్త భాషలవారు సహకరించారు. ఈ విషయంలో తెలుగువారు ఎవరికీ తీసిపోలేదు.

ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగుభాష తన సోదరభాషలకంటే, ఆర్యభాషాకుటుంబానికి చెందిన సంస్కృత-ప్రాకృతభాషా ప్రమేయంతో ఎక్కువ ప్రభావితమయినది. తెలుగు ఆ భాషల ప్రభావం ఎంతగా అలవర్చుకుందంటే, కొంతమంది విద్వాంసులకు తెలుగు సంస్కృత-ప్రాకృతజన్యమనే అభిప్రాయం కూడ ఏర్పడింది. కాని సంస్కృత-ప్రాకృత శబ్దజాలాన్ని గ్రహించినా, ఆర్య భాషా సంప్రదాయాలను సంతరించుకున్నా, తెలుగు తన మూలభాషా సంప్రదాయాలను, ధ్వని వైలక్షణ్యాలను నిలుపుకుంటూ, తన స్వతంత్ర ప్రతిపత్తికి భంగం కలగకుండా చేసుకోగలిగింది.

ఆర్యభాషా సంస్కృతులతో అవినాభావ సంబంధం ఏర్పరచుకున్న ఆంధ్రులు ప్రాకృత-సంస్కృత భాషాసాహిత్యాలకు ఎనలేని సేవచేశారు. బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాయడం దగ్గరనుండి, చాటు-ముక్తక-పద్యరచన వరకు వారు తమ ప్రతిభా వ్యుత్పత్తులను నిరూపించుకున్నారు. కొన్ని వాఙ్మయ శాఖలలో తెలుగువారి రచనలను మూర్ధన్య గౌరవం లభించింది. వైదిక విజ్ఞానంలో విద్యారణ్యస్వామి, సూత్రకారులలో ఆపస్తంబుడు, దర్శన వాఙ్మయంలో కుమారిలభట్టు, వ్యాఖ్యారచనలో మల్లినాథసూరి, కావ్యశాస్త్రంలో పండితజగన్నాథుడు, మాధ్యమిక వాద ప్రతి పాదకుడయిన నాగార్జునుడు, గీతగోవిందంతో సరితూగగల శ్రీకృష్ణ లీలాతరంగిణి కర్త నారాయణ తీర్థులు, తెలుగువారి గీర్వాణభాషా ప్రావీణ్యానికి వైజయంతికలు.

ప్రాకృత-అపభ్రంశ భాషలలో రచనలు చేసిన ఆంధ్రులు పలువురు ఉన్నారు. హాలసాతవాహనుని గాథాసప్తశతి ఉత్తరభారత వాఙ్మయరంగంలో- ముఖ్యంగా హిందీలో-అతి ప్రసిద్ధమయిన 'సతసయీ' పరంపరకు మూలమని చెప్పడంలోను, గుణాఢ్య విరచితమయిన బృహత్కథ భారతీయ భాషలన్నింటిలోను కావ్య-నాటకాదులకు ఉపజీవ్యమైన రచన అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు.

హిందీభాషలో స్వయంగా రచనాకార్యం సాగించకపోయినా, భక్తియుగంలో (15-16 శతాబ్దాలు) కృష్ణభక్తిశాఖను ప్రవర్తిల్లచేసింది వల్లభాచార్యులు. ఆయనది కంభంపాటివంశం. జననం కాకరవాడ (పాడు). ఆయన ఉత్తరభారతదేశంలోని మథురలో నివాసం ఏర్పరుచుకొని, భక్తిమార్గంలో పుష్టిసంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. ఆ సంప్రదాయంలో దీక్షితులయి, తమ రచనలతో భక్తరసికులను అమందానంద సాగరంలో ఓలలాడించిన వారే సూరదాసు, నందదాసు ప్రభృతులు. హిందీ కావ్య జగత్తుకు ఇలాంటి అనర్ఘరత్నాలను ప్రసాదించిన గౌరవం తెలుగువానికే దక్కింది. వల్లభాచార్యుల కుమారుడయిన గోస్వామి విఠలనాథుడు వ్రజభాషలో గద్యరచనకు మూలప్రేరకుడయినాడు. హిందీ సాహిత్యంలో 'రీతికాలమని' (17-18 శతాబ్దాలు) ప్రసిద్ధి చెందిన శృంగార యుగంలో పద్మాకరభట్టు (1753-1833), లాల్‌కవి అను పేరిట ప్రఖ్యాతుడయిన గోరేలాల్ (1658-1710) మొదలయిన ఆంధ్రుల రచనలు తెలుగువారికి గర్వకారణాలుగా విలసిల్లుతున్నవి.

ఈ విధంగా సాంస్కృతికంగా ఒక్కటే అయినా, భాషాభేదాలవల్ల ఏర్పడిన భిన్నత్వం ఎందాకపోయిందంటే, విదేశీయులు ఈ దేశం ఒకటికాదు, మహాఖండం అనేదాకా వచ్చింది. భారతీయభాషలన్నింటికి అంతస్సూత్రంగా ఉన్న సంస్కృతానికి రాజకీయ కారణాలవల్ల ప్రాముఖ్యం తగ్గింది. దాని స్థానాన్ని ఇంగ్లీషు ఆక్రమించింది. కాని ఇంగ్లీషు ఏ కొద్దిమందికో అలవడడంవల్ల అది భారతీయుల హృదయ భాష కాలేకపోయింది. భారతీయ సాహిత్యాలలో ఏ విధమైన మార్పులు వస్తున్నాయో, ఏఏ ఉద్యమాలు తలయెత్తుతున్నాయో, అందరికి తెలియరాని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితివల్ల ఒకనాడు ఒకే మాలలోని కుసుమాలుగాఉన్న ఈ భాషలు ఈనాడు విదేశీయ భాషలేమో నన్నంత భ్రమ కలుగుతున్నది. రాజకీయ స్వాతంత్ర్యం లభించిన తరవాతకూడా ఈ భ్రమను తొలగించే ప్రయత్నం సక్రుత్తుగానే జరుగుతున్నదని చెప్పవలసివస్తున్నది.

తెలుగుభాషను ప్రభావితంచేసిన ఆధునిక భాషలు రాజకీయకారణంగా ఉర్దూ-హిందీ భాషలయితే, సాహిత్యపరంగా ప్రభావితంచేసిన భాషలు బెంగాలీ-మరాఠీలు అని చెప్పవచ్చును. ఒక సజీవమైన భాష తన పదకోశాన్ని ఇతర భాషా పదాలతో సమృద్ధం చేసుకుంటూ ఉంటుంది. ఉత్తర భారతీయ భాషలలో ఉర్దూ-హిందీలనుండి తెలుగులోకి వచ్చిన పదాలసంఖ్య చాలా అధికమని చెప్పవచ్చును. అయితే ఇతర భాషల ఉత్కృష్ట సాహిత్యాన్ని అనువాదం చేసుకొని, ఆ అనువాదాలవల్ల ప్రభావితం కావడం ఒక అంశం. ఆయా భాషలు నేర్చుకొని, ఆయా భాషలలో రచనలు సాగించి, ఆయా సాహిత్య జగత్తులలో పేరుగడించడం మరో అంశం. బహుళ సంస్కృత-ప్రాకృతాల తరవాత హిందీభాషలోనే చాలామంది ఆంధ్రులు రచనలు చేసి ప్రసిద్ధి చెందారు. తెలుగుపై ఇతర ఉత్తర భారతీయ భాషల ప్రభావం ఏ మాత్రం లేదనే చెప్పాలి.

భారతీయ భాషలన్నింటిలో వచ్చిన సాహిత్యాన్ని స్థాలీపులాకంగా పరిశీలిస్తే, ఈ క్రింది లక్షణాలు సమానంగా కనిపిస్తవి. ఆధునిక భారతీయ భాష లన్నింటిలోను

వాఙ్మయ రచన దాదాపు 10-11 శతాబ్దులలోనే ప్రారంభమయింది. ఆరంభదశలో రామాయణ, మహాభారత, భాగవతాలు, పురాణాలు మొదలయిన సంస్కృత రచనల ప్రభావం, ఆ తరవాత క్రమంగా ఇస్లాం ప్రభావం, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం-ఈ క్రమం అన్ని భాషా సాహిత్యాల మీద సమానంగా-కొంచెం ముందు వెనుకలుగా-కనిపిస్తుంది. 19వ శతాబ్దంలో పాశ్చాత్య సంస్కృతి సాహిత్యాల సంబంధంతో-పునర్జాగరణ కాలంలో-సాంస్కృతిక ఆధ్మాత్మవాదం, సంఘసంస్కరణోద్యమం, కాల్పనికోద్యమం ప్రధానంగా కల రచనలు వచ్చినవి. ఆ తరవాత వచ్చిన రచనలో జాతీయోద్యమ ప్రభావం, గాంధీయ సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది. 20వ శతాబ్దం మూడు-నాలుగు దశాబ్దాలలో సామ్యవాద ప్రభావిత మయిన అభ్యుదయ రచనలు, ఫ్రాయిడ్, యుంగ్, ఇలియట్ మొదలయినవారి సిద్ధాంతాలచే ప్రభావితమయిన మనోవిశ్లేషణ, వాస్తవికతావాదం, అధివాస్తవికతా వాదంలాంటి కొత్త కొత్త ప్రవృత్తులు అన్ని సాహిత్యాలలో కనిపించసాగినవి. ఈ విధంగా వివిధ భాషలలో అభివ్యక్తమయిన భారతీయ సాహిత్యంలో ప్రాదేశిక వైలక్షణ్యాలతోపాటు, సమాన ప్రవృత్తులూ కనిస్తవి. భాషాగతమయిన, వస్తుగతమ యిన కొద్ది భేదాలు ఉన్నప్పటికీ భారతీయ భాషలలో వచ్చిన సాహిత్యంలోని మూల ధ్వని ఒకటే. మూలభావం ఒకటే. భావాత్మకమయిన ఈ సమైక్యాన్ని ఉద్ఘోషిస్తూ, శ్రీ అరవిందులు ఇలా అన్నారు.

'The same culture reigns amid many variation of form in all this work of the regional peoples but each creates on the lines of its own peculiar character and temperament and gives a different stamp, the source of a rich variety in unity to each of these beautiful and vigourous literature'[1]

(ప్రాంతీయ భాషలోని వివిధ సాహిత్య ప్రక్రియలలో ఒకే సంస్కృతి నేతృత్వాన్ని వహిస్తున్నది. కాని ఒక్కొక్క భాష తన ప్రత్యేక లక్షణాలను, ప్రత్యేక ధోరణులను వ్యక్తం చేస్తూ, తన ప్రత్యేకతా ముద్రను ప్రదర్శిస్తుంది. సౌందర్య విలసితాలు, శక్తిమంతాలు అయిన ప్రాంతీయ సాహిత్యాలకు మూలాధారం వైవిధ్యంలో కనిపిస్తున్న ఏకీభావమే.)

II

భారతదేశంలోని భాషలను స్థూలంగా రెండు కుటుంబాలుగా విభజింపవచ్చును. దక్షిణ భారతదేశంలో వ్యవహారంలో ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ భాషలు ద్రావిడభాషా కుటుంబానికి, ఉత్తర భారతదేశంలో వ్యవహారంలో ఉన్న సంస్కృత, ప్రాకృత, అపభ్రంశ భాషా జన్యాలయిన అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కాశ్మీరీ, హిందీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ మొదలయిన భాషలు ఆర్య భాషా కుటుంబానికి చెందినవి.

ఉత్తర భారతదేశంలో ప్రసుత్తం వ్యవహారంలో ఉన్న ప్రముఖభాషలు సంస్కృతం, ప్రాకృతం, అపభ్రంశ భాషలనుండి వికసించినవే. అపభ్రంశ భాషలనుండి ఆయా భాషలు దాదాపు 10–11 శతాబ్దాలనుండి విడివడి, ప్రత్యేక భాషలుగా రూపొందినవి. అప్పటినుండే ఈ ఆధునిక భాషలలో సాహిత్యరచన ప్రారంభమయింది. దక్షిణ భారతదేశంలో తమిళ, కన్నడ భాషలలో అంతకు చాలాముందే సాహిత్య రచన జరిగినా, తెలుగు భాషలో మాత్రం సాహిత్య రచన 11వ శతాబ్దంలోనే మొదలయినది. 10–11 శతాబ్దులకు ముందు ప్రతిభాషా ప్రాంతంలోను జానపద వాఙ్మయం ప్రచురంగా ఉన్నట్లు తెలుస్తున్నది. రాగిరేకులు, శిలాశాసనాల మూలకంగా ఆనాటి భాషా స్వరూపం తెలుసుకోవడానికి వీలుకలుగుతున్నది.

దక్షిణ–ఉత్తర భారతదేశాలకు కూడలి స్థానంలో ఉన్న ఆంధ్రదేశంలో భాషా స్వరూపం స్థిరపడి, సాహిత్యరచనకు పునాదులు పడడానికి ద్రావిడ–ఆర్య భాషా సాహిత్య సంప్రదాయాల కలయికయే కారణమని విద్వాంసుల అభిప్రాయం. 'ఆర్యజాతికి చెందిన ఆర్యులు ఈ దక్షిణ దేశమయిన కృష్ణా గోదావరి మధ్య ప్రాంతమున నెలకొని అచ్చటి జనులతో కలిసిపోయి వారి భాషను చేపట్టిన పిదప అచ్చటివారి తెలుగు భాషనే వ్యవహరించి ఉందురు. ...... దీనిని బట్టి ఆంధ్రులు, తెలంగులు కలిసి ఆంధ్రులుకాగా, తెలంగ దేశమునకు, తెలంగు భాషకు ఆంధ్రము

1. As quoted by Shri M. V. Rajgopal, I.A.S. in his essay on 'Literature and National Integration' (P. 14) - National Integration Series IV.

అను నామము ఆంధ్రుల ప్రాబల్యముననే కలిగినదని స్పష్టమగుచున్నది.'1 కాబట్టి ఇతర ద్రావిడ-ఆర్యభాషా-సాహిత్యాలకంటే ఎక్కువగా తెలుగులో ద్రావిడ-ఆర్య సాహిత్య సంప్రదాయాల సమ్మేళనం కనిపిస్తుంది.

ప్రోటో ద్రవిడియన్ (మూల ద్రవిడ భాష) లేక ప్రాకృత-అపభ్రంశ భాషల నుండి విడివడ్డ తరవాత ఆధునిక భారతీయ సాహిత్య వికాస క్రమంలో ప్రత్యేకమయిన సమాన లక్షణాలు కనిపిస్తవి.

క్రీ.శ. 10వ శతాబ్దం నాటికి బౌద్ధ జైన సంప్రదాయాలకు వైదిక ధర్మానికి కలిగిన సంఘర్షణల మూలంగా, మతాభినివేశంతో కూడుకొన్న రచనలు వచ్చాయి. హిందీలో సాహిత్య రచన ప్రారంభానికి ముందు నవనాథులు, చౌరాసి (84) సిద్ధులు మొదలయిన వారి అపభ్రంశ భాషాసమ్మిశ్రిత మయిన రచనలు, బెంగాలీలో 'చర్యాపదాలు,' అస్సామీలో 'డాకేర్ బచన్' (డాక్ కవి రచనలు), ఒరియాభాషలో లభించిన 'బౌద్ధగాన్ ఔ దోహా' (బౌద్ధ గీతాలు, దోహాలు), కాశ్మీరీలో సితికంఠుని 'మహానాయ ప్రకాశ్', మరాఠీలో ముకుందదాసుని 'వివేక సింధు', పంజాబీలో నాథసాహిత్యం, తెలుగులో శైవ సాహిత్యం మొదలయిన రచనలే కాకుండా, మహాభారత, రామాయణ అనువాదాలతో సాహిత్యం ప్రారంభమయింది. బెంగాలీలో కృత్తివాస రామాయణం, అస్సామీలో మాధవ కందళీ రామాయణం, ఒడియాలో బలరామదాసు, సరళాదాసులు వేర్వేరుగా రచించిన రామాయణాలు, హిందీలో తులసీదాసు రచించిన రామచరిత మానసం, తెలుగులో రంగనాథ, భాస్కర రామాయణాలు, బెంగాలీ కాశీరామ్‌దాసు మహాభారతం, ఒరియాలో సరళాదాసు రచించిన మహాభారతం, తెలుగులో కవిత్రయ కృతమహాభారతం, ఒరియాలో జగన్నాథదాసు, హిందీలో సూరదాసు, తెలుగులో పోతనామాత్యుడు మొదలయిన వారి భాగవత రచనలు, లాల్‌దే (కాశ్మీరీ), నరసీమెహతా (గుజరాతీ), చండీదాసు (బెంగాలీ) మొదలయిన వారి ఆధ్యాత్మిక సాహిత్యం వంటి రచనలతో భారతీయ సాహిత్యంలోని ప్రారంభదశ సమృద్ధంగా కనిపిస్తుంది.

1. శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు : తెలుగుభాష-పరిణామము. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము III - పేజి 26.

దేశంలో ఇస్లాం ధర్మ ప్రాభవంతో ఫారసీ సాహిత్య సంప్రదాయాలు, సూఫీ సిద్ధాంతాలతో కూడిన సాహిత్యం రచించబడింది. ఈ మధ్యయుగంలో శౌరసేని అపభ్రంశ జన్యమైన ఉర్దూభాష దక్షిణ భారతదేశంలో, బహమనీ సుల్తానుల రాజ్యకాలంలో సాహిత్య రచనకు ఉపయోగపడింది. ఆ తరవాత, 2-3 శతాబ్దాల తరవాత, ఉర్దూభాష మళ్ళీ ఉత్తర భారతదేశం చేరింది.

ఇస్లాం మత విజృంభణతో, ఆ మతానుయాయుల విలయతాండవంతో, దేశంలోని దేవాలయాలకు, ధర్మసంస్థలకు, సత్పురుషులకు రక్షణలేని పరిస్థితి ఏర్పడింది. భగవంతుడు తప్ప మరే శక్తి తమను ఉద్ధరించలేదనే భావం బాగా ప్రబలిపోయింది. కర్మకాండ కాక శరణాగతి ఒక్కటే సంతరణోపాయంగా కనిపించింది. లౌకిక మర్యాదలపట్ల తూష్ణీంభావంతో కేవల నిర్గుణ, నిరాకారుడయిన భగవంతునిపట్ల భక్తి పెరిగిపోయింది. ఇది ఇస్లాం, హిందూ ధర్మవిభేదాలకు అతీతమయిన భక్తి సాహిత్య సృష్టికి దారితీసింది. ఆ భక్తి సాహిత్యం పరోక్షంగా సంఘంలో సమైక్య భావాన్ని పెంపొందించ గలిగింది.

మహారాష్ట్రంలో నామదేవ్, జ్ఞానేశ్వర్, తుకారామ్, రామదాసు మొదలయిన వారు తమ రచనలతో ప్రజలను జాగృతులను చేస్తే, గుజరాతులో మీరాబాయి, నరసీ మెహతా లాంటివారు కృష్ణ భక్తి ప్రచారం చేశారు. హిందీలో నిర్గుణ భక్తికి చెందిన కబీరు, నానక్, సూఫీ సాధకుడయిన మలిక్ ముహమ్మద్ జాయసీ ఒక వైపున, శ్రీకృష్ణ భక్తుడయిన సూరదాసు, నందదాసులు, శ్రీరామభక్తుడయిన తులసీదాసు మరోవైపున, తమతమ ప్రత్యేక పద్ధతులలో భక్తి మార్గ ప్రచారం చేశారు. కాశ్మీరులో షేక్‌నూరుద్దీన్ సూఫీ రహస్యవాద సిద్ధాంత ప్రచారం చేసిన వారిలో ప్రముఖుడు. బెంగాలీ, ఒరియాలలో రాధాకృష్ణ భక్తి సంప్రదాయపు వెల్లువ వచ్చింది. బెంగాలీలో చండీదాసు, ఒరియాలో దీనకృష్ణ, అస్సామీలో శంకరదేవ్ వైష్ణవభక్తి ప్రచారం చేశారు. చైతన్యుడు కీర్తన సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కాడు. తమిళ, కన్నడ, మలయాళ, తెలుగు భాషలలో శైవ, వైష్ణవ భక్తి ప్రాచుర్యం దీప్తినందుకొన్నది. ఈ యుగంలో

ప్రజాసామాన్యంలో భక్తి భావాలను జాగరితం చేసే ప్రయత్నాలకు సాహిత్యం ఊతగా నిలిచింది. ప్రజా సామాన్యానికి అర్థమయ్యేభాషలో కవులూ, భక్తులూ, తమరచనలు సాగించారు. భక్తి కథలకు నెలవులయిన రామాయణ, భారత, భాగవతాలు సరళభాషలో వ్రాయబడ్డవి. మహాభక్తుల జీవిత చరిత్రలు కావ్యకథా వస్తువులయినవి.

ఈ యుగంలో పశ్చిమ భారతదేశంలో–ముఖ్యంగా హిందీ భాషా ప్రాంతంలో–హిందూ–ముస్లిం మత సంప్రదాయాల సమన్వయానికి ప్రయత్నాలు జరిగినవి. ఆంధ్రదేశంలో వీరశైవ, వీరవైష్ణవుల మధ్య సమన్వయం కుదర్చడానికి జరిగిన ప్రయత్నమే హరిహరనాథ తత్త్వనిరూపణం.

మధ్యయుగంలోని చివరిభాగంలో శృంగారభావ పూర్ణమయిన కావ్య రచన సాగింది. ఆ యుగంలోని కావ్యరచనకు విలాసతత్పరత, శృంగార ప్రియత్వం, రచనలో చమత్కారానికి ప్రాధాన్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తవి. రసోద్దీప్తి, కళాసౌందర్యాన్నే ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకొని, తమ ప్రభువుల ఆనందమే తమ రచనాచాతుర్యానికి పరమావధిగా పెట్టుకొని, వారు రచనలు సాగించారు. ఈ శృంగార రస ప్రాధాన్యానికి ముఖ్యకారణాలు ఆనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులే. విలాస జర్జరమైన జాతికి కామవాసనకంటే ఉపాస్యం వేరే విషయం ఉండదు కదా ! కాని ఈ విశుద్ధ కామ భావన నిసర్గకళాసృష్టికి ఆలంబనం కాగలిగింది; కళను కళగా నెలకొల్ప కలిగింది.

ఈ విధంగా విలాస జర్జరమైన జాతి, స్వీయ పరాక్రమం పట్ల ప్రత్యయం లేని జాతి, పాశ్చాత్య ప్రభావానికి లొంగిపోయింది.

19వ శతాబ్దంలో పాశ్చాత్య సాహిత్య సంబంధం అంకురించి, క్రమంగా ముదిరి, 1857 నాటికి మహావృక్షమయి, భారతీయ సాహిత్యంలో నూతన దృక్పథ ఛాయలను ప్రసరింప చేసింది. కలకత్తాలో ఫోర్టు విలియమ్ కాలేజీ స్థాపనతో తొలిసారిగా బెంగాలీ, హిందీ–ఉర్దూ భాషాసాహిత్యాలపై ఈ ప్రభావం ముఖ్యంగా కనిపిస్తుంది. భారతీయ పండితుల సహాయంతో విద్యాప్రియులయిన ఇంగ్లీషువారు వ్యాకరణాలు, పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు వ్రాశారు. వ్రాయించారు. క్రైస్తవ

మిషనరీలు బైబిలును భారతీయ భాషలన్నింటిలోకి అనువదించి, అనువదింపచేసి, గద్యరచన వికాసానికి దోహదం కల్పించారు. ఈ విధంగా, ఆధునిక యుగంలో ప్రతిభారతీయ భాషకు ఇంగ్లీషువారు చేసిన సేవ మరువరానిది. ముద్రణ సౌకర్యాలు కల్పించి పత్రికలు ప్రచురించి, సాహిత్యాన్ని జనసామాన్యానికి సన్నిహితం చేసే కృషికి వారు నాంది పలికారు. ఆ రోజుల్లో ప్రభవిల్లిన ప్రతిభామూర్తి, ఉర్దూ మహాకవి గాలిబ్ వారు చీకట్లను పారద్రోలి, ఉషస్సందేశాన్ని అందిస్తున్నారని ధ్వని ప్రధానంగా, నాటి పరిస్థితులను వర్ణించాడు.

పాశ్చాత్య పరిపాలన, విద్యావిధానాల ఫలితంగా సంఘములో ఒక కొత్తవర్గం 'మధ్యతరగతి' ఉద్భవించింది. దాంతో కొత్త కొత్త సమస్యలు రచనకు వస్తువులుగా వెలిశాయి.

డాక్టరు సునీతి కుమార్ ఛటర్జీ అన్నట్లు 'Contract with the European spirit through English literature ushered in the Indian Renaissiance and gave a new course to the literature in modern Indian languages.'[1] (ఇంగ్లీషు సాహిత్యం ద్వారా పాశ్చాత్య భావస్ఫూర్తితో సంబంధం, భారతదేశంలో పునరుజ్జీవనాన్ని ఉత్తేజపరిచింది. అది ఆధునిక భారతీయ సాహిత్యాలలో, కొత్తమలుపుకి కారణమయింది). ఇంగ్లీషు సాహిత్యం, ఆధునిక విజ్ఞానం సహజంగా ఆలోచనాశీలురయిన భారతీయులను ప్రభావితులను చేయడంలో ఆశ్చర్యం లేదు.

ఆంగ్లభాషా-సాహిత్యాల పఠనంవల్లా, పాశ్చాత్య సంస్కృతి వ్యాప్తివల్లా, పాశ్చాత్య జీవితాదర్శాలతో సంబంధంవల్లా, దేశంలో రాకపోకల సౌకర్యాలు, ముద్రణా అవకాశాలు అభివృద్ధి చెందడంవల్లా, దేశం మొత్తం మీదట ఒక నూతన యుగం ప్రారంభమయింది. స్వభాష, జాతీయ సంస్కృతులపట్ల ఆనాటి యువతరం ఉద్దీప్తం కావడానికి ఆంగ్ల విద్యాభ్యాసమే ప్రధానకారణమని చెప్పడంలో ఎలాంటి సందేహం

1. Literature in Modern Indian Languages-Edited by V.K.Gokak. p. 44.

లేదు. ఆంగ్ల సాహిత్యాధ్యయనంవల్లనే భారతీయ సాహిత్యంలో ఆధునిక యుగానికి అంకురార్పణ జరిగింది. వంగభాషలో రాజారామమోహన్ రాయ్, బంకించంద్రఛటర్జీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఒరియాలో రాధానాథ్, హిందీలో భారతేందు హరిశ్చంద్ర, గుజరాతీలో దల్పత్‌రామ్, నర్మదాశంకర్, మరాఠీలో విష్ణుకృష్ణ చిప్‌లూన్‌కర్, తెలుగులో కందుకూరి వీరేశలింగం పంతులు మొదలగు నవయుగ నిర్మాతలు సంఘ సంస్కరణోద్దేశ్యంతో నూతనవాఙ్మయ ప్రక్రియలకు పునాదులు వేశారు. పద్యరచన వెనకబడి, గద్యరచనకు, నాటక రచనకు అగ్రతాంబూలం లభించింది. కవిత్వం రంగంలో కూడా భావకవిత్వానికి ప్రాబల్యం కలిగింది. ప్రణయం, ప్రకృతి, దేశభక్తి కావ్యానికి ప్రధాన వస్తువులయినవి.

పాశ్చాత్య సంస్కృతి ప్రభావంచేత కలిగిన సాంస్కృతిక పరిణామంవల్ల సంఘ సంస్కారోద్యమం ప్రబలమయింది. బెంగాలులో బ్రహ్మసమాజం, దివ్య జ్ఞానసమాజం, గుజరాతు, పంజాబులో ఆర్యసమాజం మొదలయిన మత, సంఘ సంస్కరణోద్యమాల ప్రభావం దేశం మొత్తం మీద కనిపించసాగింది. జాతీయ ఆత్మ గౌరవం ప్రబోధం కలగజేసిన మహాత్ముడు వివేకానందుడు. వారి రచనలు, ఉపన్యాసాలు సమస్తదేశాన్ని ఉద్బోధించి, చైతన్యవంతం చేసినవి.

జాతీయోద్యమానికి కర్ణధారులయిన వీరసావర్కార్, బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, బాబు రాజేంద్రప్రసాద్, అనీబిసెంటు మొదలయినవారు తమ రచనలతో, ఉపన్యాసాలతో ప్రజలు స్వదేశ, స్వజాతి గౌరవాన్ని గుర్తించేటట్లు చేశారు. ఈ జాతీయోద్యమాన్ని సామాన్య ప్రజలలో కూడా వ్యాపింపచేసిన వారు మహాత్మా గాంధీ. ఈ జాతీయోద్యమ ప్రభావం భారతీయ సాహిత్యాలన్నింటిలోను సమానంగా కనిపిస్తుంది. గాంధీవారి వ్యక్తిత్వ, సిద్ధాంతాల ప్రభావంతో భారతీయ భాషలన్నింటిలోను విపులమయిన సాహిత్యం వచ్చింది.

1930-36 ప్రాంతాలలో సామ్యవాద సిద్ధాంతాల ప్రభావం ప్రబలం కావడంతో, భారతీయ సాహిత్యంలో వర్గసంఘర్షణ, పెట్టుబడిదారీ వర్గం దోపిడి,

కూలి, రైతు జనాల కష్టసుఖాలు మున్నగు విషయాలను చిత్రించే అభ్యుదయవాదధోరణులు ప్రారంభమైనవి.

ఫ్రాయడ్, యుంగ్ మొదలయిన మనస్తత్వ శాస్త్రజ్ఞుల సిద్ధాంతాల ప్రభావం వల్ల వ్యక్తి మనస్తత్వ చిత్రణకు మనోవిశ్లేషణాత్మకమయిన సమస్యలకు నవలల్లో, కథల్లో ప్రాధాన్యం లభించింది.

నూతన సాహిత్య ప్రక్రియలకు ముక్తచ్ఛందం లేక స్వేచ్ఛాఛందం ప్రయుక్తం కాసాగింది.

స్వాతంత్ర్యోపలబ్ధికి పూర్వం భారతీయసాహిత్యాలలో పూర్వ వైభవాన్ని సముజ్జ్వలంగా చిత్రించే రచనలు, దేశభక్తిని ప్రబోధించే రచనలు, మాత్రారాధనం, సంఘసంస్కరణం, ఆమలిన శృంగారం మొదలయిన విషయాలతో కూడిన రచనలు ప్రస్ఫుటంగా, ప్రధానంగా కనిపించేవి. స్వాతంత్ర్యానంతరం కల్పనల్లో, ప్రక్రియల్లో ఇతరదేశ వాఙ్మయ ప్రభావం, అనుకరణ అధికంగా కనిపిస్తున్నది.

పరప్రభుత్వం అంతరించి, స్వరాజ్యం వచ్చినా, దేశ ప్రజల కష్ట-నష్టాలు ఎక్కువై, సుఖశాంతులు గగన కుసుమాలు కావడంతో, ప్రస్తుతవ్యవస్థలోని కుళ్ళును కడిగివేయాలని రచయితలు ప్రయత్నిస్తున్నారు. బెంగాలులోని భూఖీపీడీ, హిందీలోని నయీకవిత, అకవితలు, తెలుగులోని దిగంబరకవిత, విప్లవ కవితలు ఇలాంటి భావాల ప్రభావంవల్ల వచ్చినవే.

నిష్పాక్షికంగా అధ్యయనంచేస్తే ఉత్తర భారతంలో, దక్షిణ భారతంలో ప్రచురంగా ఉన్న భాషల్లో వెలువడిన, వెలువడుతున్న, సాహిత్యాలలో అంతరాత్మ ఒకటిగానే గోచరిస్తుందనే యాథార్థ్యం ప్రత్యక్షమవుతుంది. వైజ్ఞానికాన్వేషణల ఫలితంగా విశ్వాత్మా విష్కృతికి ఈ సాహిత్యాలు ప్రతీక్షిస్తున్నట్లుగా ద్యోతకమవుతున్నది. భాష బాహిర రూపం కనుక సీమితం, దాని అంతస్సు సాహిత్యం. అది అనంతం.

భారత సాంస్కృతిక రంగంలో 'మధ్యదేశ' (గంగాయమునల మధ్య ప్రాంతం) భాష అయిన సంస్కృతం సర్వ భాషా సాహిత్యాలకు మూలకందంగా విలసిల్లిందని తెలుసుకున్నాము. భాషా శాస్త్రపరంగా సంస్కృత-ప్రాకృతాల నుండి జనించిన హిందీ భాషకు, మధ్యయుగంలో, దేశవ్యాప్తంగా ప్రచారం కలిగింది. రాజకీయ, సాంఘిక, మత సంబంధమైన కారణాలవల్ల హిందీ-హిందుస్థానీ భాషలు మాట్లాడేవారు దేశం నలుమూలలా వ్యాపించారు. అపభ్రంశ భాషా సమ్మిశ్రితమయిన హిందీలో రచనలు సాగించి, సంఘసంస్కరణకు నడుంకట్టిన గోరఖనాథాది నవనాథుల చరిత్ర ఆధారంగా గౌరన 'నవనాథచరిత్ర' (14వ శతాబ్దం) రూపుదాల్చింది. అనగా 14వ శతాబ్దంనాటికే నవనాథుల చరిత్రకు దేశవ్యాప్తమైన ప్రచారం లభించిందన్న విషయం రూఢమవుతున్నది.

17వ శతాబ్దం చివరి భాగంలో తంజావూరును పరిపాలించిన మహారాష్ట్ర నరేశుడు, అభినవభోజుడయిన షాహజీమహారాజు (1684-1712) తెలుగులోనే కాక, హిందీలో కూడా యక్షగానాలు రచించాడు. 'రాధా వంశీధర విలాస నాటకం'లో రాధాకృష్ణుల సంయోగ వియోగాలు, 'విశ్వాతీత విలాసనాటకం'లో త్రిమూర్తులలో శివ మాహాత్మ్యం చిత్రించబడ్డవి. ఈ నాటకాల భాష హిందీ అయినా, పాటలు కర్ణాటక సంగీతబాణీలో వ్రాయబడ్డవి. కర్ణాటక సంగీతబాణీలో ప్రప్రథమంగా హిందీ భాషను మలచిన గౌరవం షాహజీమహరాజుదే. ఈ మధ్యనే షాహజీ మహారాజు రచించిన మరో నాటకం వెలుగులోనికి వచ్చింది. ఆ యక్షగానం పేరు 'పంచభాషా విలాసనాటకం.' ఈ రచనలో సంస్కృతం సూత్రధారభాష (Link Language). కాగా ఇతర పాత్రలు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మరాఠీ భాషలు వ్యవహరిస్తారు. ఈ నాటకంలో ధర్మజ రాజసూయ సందర్భంలో వచ్చిన అనేక దేశాల రాకుమార్తెలు, తమతమ భాషలలో శ్రీకృష్ణునికి ప్రణయ నివేదనం చేయడం అనే శృంగార రస భూయిష్ఠమైన సన్నివేశాన్ని చిత్రించాడు షాహజీ. ఈ రచనలు యక్షగాన ప్రక్రియకు సంబంధించినవి.

1880-81ల మధ్య, ఆ తరవాత 1885లో 'ధార్వాడ నాటక కంపెనీ' అనే పేరిట ఆంధ్రప్రాంతంలో పర్యటించి, వెళ్ళిన చోటల్లా హిందీలో నాటకాలు ప్రదర్శించిన, 'ఆల్టేకర్ నాటకసమాజం' తెలుగు నాటకరంగానికి నాటక సాహిత్యానికి ఎనలేని సేవచేసింది. ధార్వాడ కంపెనీల ప్రదర్శనలు చూచి, ఆ విధంగా నాటకాలు రచించి, ప్రదర్శించాలన్న సంకల్పం చాలామంది ఆంధ్రులకి కలిగింది. శ్రీ కె.వి.గోపాలస్వామి గారన్నట్లు 'ఆ సంకల్పమే ఆంధ్ర నాటక ప్రదర్శనానికి నాందీవాక్యం.' ధార్వాడ నాటక కంపెనీ ప్రదర్శనల ఫలితంగా, ఆంధ్రదేశంలోని అనేక నగరాలలో నాటక సమాజాలు వెలిశాయి. వీరు చాలా మటుకు తెలుగులోనే నాటకాలు వ్రాయించి, అభినయించేవారు. కాని 1884లో మచిలీపట్టణంలో 'నేషనల్ థియేటర్'ను స్థాపించిన మొగిలిగిద్దల రామానుజరావుకు, దాసాని వెంకటస్వామి నాయుడుకు ధార్వాడ నాటక కంపెనీ వారివలె హిందీలో నాటకాలు ఆడించాలనే అభిప్రాయం కలిగింది. అందుచేత వారు రేపల్లెలో స్కూలు టీచరుగా పనిచేస్తున్న నాదెళ్ళ పురుషోత్తమ కవిని హిందీలో నాటకాలు వ్రాసి పెట్టమని అడిగారు. పురుషోత్తమ కవిగారు రెండు సంవత్సరాలలో (1884-86) 32 హిందీ నాటకాలు వ్రాసి ఇవ్వడమే కాకుండా, స్వయంగా దర్శకత్వం నెరపారు. రెండవసారి ఆంధ్రదేశం వచ్చిన ధార్వాడ నాటక కంపెనీ వారు ఆ నాటకాలు చూచి, చాలా ప్రశంసించారట. తమ 32 నాటకాలలో మచ్చుకి ఒక్క నాటకాన్ని 'రామదాసచరిత్ర'ను స్వయంగా పురుషోత్తమ కవిగారు 1916లో తెలుగు లిపిలోనే ముద్రించారు. అయితే ఆ రోజుల్లో పురుషోత్తమ కవిగారే కాక, మరికొందరు ఆంధ్రులు హిందీలో నాటకాలు వ్రాసి, ప్రదర్శించారని శ్రీపంచాగ్నుల యజ్ఞనారాయణశాస్త్రిగారు, శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు మొదలయిన వారు వ్రాశారు. శ్రీ యజ్ఞనారాయణశాస్త్రిగారు 'ఆంధ్రనట ప్రకాశిక'లో, ఐదవ అధ్యాయంలో ఈ విషయాన్ని విశదంగా వ్రాశారు. శాస్త్రి గారు 'విశాఖపట్టణంలోని జగన్మిత్ర సమాజం వారు 1889-90లలో హిందీలో నాటకాలు ప్రదర్శించారనీ, ప్రియసల్లాప నాటక కంపెనీ వారు గోవిందరావు, శంకరం అనే ప్రముఖ నటుల సహాయంతో హిందీ నాటకాలు ఆడారనీ, కాకినాడలో వెదురు

మూడి శేషగిరిరావు 'శివాజి చరిత్ర', 'పీష్వా నారాయణరావు వధ' అనే హిందీ నాటకాలు వ్రాసి, ప్రదర్శించారనీ, ఏలూరులో వామనభట్టజోషి 1885 నుండి 1890లో హిందీ నాటకాలు ప్రదర్శింపచేస్తూ ఉండేవారనీ, 1902లో నరసాపురంలో బుద్ధిరాజు బ్రహ్మానందం, బొమ్మకంటి కృష్ణమూర్తి, మామిళ్ళపల్లి కేశవాచార్య అనే వారు 'ఆర్యానంద హిందూ నాటక సమాజం' స్థాపించి హిందీలో నాటకాలు అభినయింపచేసే వారనీ, కేవలం హిందీ నాటకాల ప్రదర్శనకై భీముని పట్టణంలో మింది రామచంద్రరావుగారు 'భక్తి విలాసినీ సమాజాన్ని 'స్థాపించారనీ' వ్రాశారు. తాత్పర్యం ఏమిటంటే ఆంధ్ర నాటక సాహిత్య ప్రారంభదశలో పలువురు తెలుగువారు హిందీ-హిందుస్తానీ భాషలలో చాలా నాటకాలు వ్రాశారు. కాని కేవలం నాటక సమాజాలకోసం వ్రాయబడడంతో, ఆ నాటక సమాజంవారి మోజుతీరగానే, ఆ నాటకాలు కూడా కాలగర్భంలో కలిసిపోయాయి. కాని కీ.శే.నాదెళ్ళ మేధా దక్షిణామూర్తి గారి కృషివలన పురుషోత్తమ కవిగారి హిందీ రచనలలో-32 నాటకాలలో-14 నాటకాలు మాత్రం నశించిపోకుండా నిలిచి, ఆంధ్రులు హిందీ నాటకానికి చేసిన సేవను గుర్తుకు తెస్తూఉన్నవి.

ఈ సందర్భంలోనే శ్రీ శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి గారు, మండా కామయ్య లేక నరహరిశాస్త్రిగారి రామచరిత మానసానువాదం పేర్కొనదగినది. దోహా, చౌపాయి మొదలయిన హిందీ ఛందస్సులలో, ద్వితీయాక్షరప్రాస, అంత్యానుప్రాస, తెలుగు యతి నియమాలను పాటిస్తూ, ఆంధ్రీకరించబడిన ఈ రచనలో ధారాశుద్ధి లేకపోయినా, అనువాదకుల కృషి ప్రశంసనీయము. శ్రీముక్కామల రుక్మేశ్వర శాస్త్రి వ్రాసిన వ్రాత ప్రతి మాత్రం ప్రస్తుతం లభిస్తున్నది.

దక్షిణాఫ్రికా నుండి వచ్చి, భారత రాజకీయ రంగంలో ప్రవేశించడానికి ముందుగా, గాంధీగారు ఒక సంవత్సరంపాటు భారతదేశ పర్యటన చేశారు. ఆ పర్యటనలో భారతదేశానికంతా జాతీయభాష కాగలిగిన అర్హత హిందీకే ఉన్నదని వారు గ్రహించారు. అందుచేత వారు తమ నిర్మాణ కార్యక్రమంలో హిందీకి ప్రముఖ

స్థానం కల్పించారు. దాంతో జాతీయోద్యమంతో పాటు హిందీ భాషా ప్రసార-ప్రచార కార్యక్రమాలకు అత్యధికంగా ప్రోత్సాహం లభించింది. ఆంధ్రదేశంలో కూడా హిందీ భాషా ప్రచారం ముమ్మరంగా సాగింది. హిందీ భాష నేర్చుకోవడమూ, నేర్పించడమూ జాతీయ భావానికి ప్రధాన లక్షణాలుగా ఎంచబడ్డవి. ఖద్దరు ధరించడానికి, వందేమాతరం పాడడానికి కలిగిన ప్రాముఖ్యమే హిందీ ప్రచారానికి కూడా కలిగింది. రాజకీయ రంగంలో ముందుగా వచ్చిన ఈ ప్రభావం సాంస్కృతిక-సాహిత్య రంగాలలో కూడా కనిపించింది. కీ.శే.బసవరాజు అప్పారావుగారి లాంటివారు కూడా ఆంధ్రసాహిత్యం సమృద్ధం కావడానికి అన్యభాషా సంస్కారమూ, అన్యసాహిత్య పరిచయమూ అవసరమని ఉద్ఘాటించారు. ఆంధ్రులు ఇతర భాషలు-ప్రధానంగా ఆంగ్లం, బెంగాలీ, హిందీ భాషలు నేర్చుకొని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, ఇతర భాషలలో రచనలు సాగించి, తమ ప్రతిభావ్యుత్పత్తులు వెల్లడించారు.

ఉత్తరభారత సాహిత్యాలలో ముఖ్యంగా బెంగాలీ, హిందీ భాషల ప్రభావం తెలుగు సాహిత్యం మీద కనిపిస్తుంది. బెంగాలీ భాషలో వచ్చిన సాహిత్య ప్రక్రియలు, ఆ సాహిత్యంలోని ప్రతిభామూర్తుల రచనలు-వీటి ప్రభావం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను తెలుగు సాహిత్యంలో కనిపిస్తుంది. కాని ఆయా భాషలను నేర్చుకొని అందులో స్వయంగా రచనలు సాగించినవారు చాలాతక్కువ. *అందుచేత ముందుగా హిందీ భాషా సాహిత్యాల ప్రభావాన్ని గురించి ముచ్చటించుకుందాము.

మరో భాషలోని ఉత్కృష్టమైన రచనచే ప్రభావితుడయి, సహృదయుడయిన రచయిత, ఆ రచనను తన భాషలో అనువదించి, తన వారికి ఆ ఆనందాన్ని అందిద్దామని ప్రయత్నం చేస్తాడు. తన భాషలోని శ్రేష్ఠమయిన రచనలను ఇతర భాషలలోకి అనువదించి, ఆ రచనల సాహిత్య గౌరవంతో ఇతరులకు పరిచయం కల్పించాలని కూడా ప్రయత్నం చేస్తాడు. ఈ భావనయే అనువాద ప్రక్రియకు మూలం.

---

* తెలుగు విజ్ఞానసర్వస్వాన్ని అందించడానికి ప్రప్రథమంగా ఉద్యమించిన కీ. శే. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు పంతులుగారు మరాఠీ భాషలో విద్వత్తును సంపాదించి, మరాఠీ రచయితగా పేరొందినారు. అయితే ఆంధ్రులు హిందీ భాషను నేర్చుకొని, అందులో సాహిత్యాన్ని సృష్టించిన ఘనతను సంపాదించుకున్నారు.

అనువాదం ఇతర భాషా సాహిత్యాలవల్ల కలిగే పరోక్ష ప్రభావం అని చెప్పాలి. అనువాదాల ద్వారా హిందీ సాహిత్యంలోని ఉత్తమ రచనలు ఎన్నో తెలుగులోకి వచ్చాయి. ఆ అనువాదాల వల్ల తెలుగు సాహిత్యంలో కొత్తపోకడలు వచ్చాయి. ఈ పరోక్ష ప్రభావం ముఖ్యంగా నవలా సాహిత్యంలో కనపడుతుంది. ఉన్నవవారి మాలపల్లి మొదలయిన వాటితో తెలుగు నవలలో వచ్చిన గ్రామీణ సమస్యల చిత్రణకూ రాజకీయ చైతన్య చిత్రణకూ ప్రేమచందు నవలల తెలుగు అనువాదాల ప్రభావం మరికొంత తోడ్పడింది అని చెప్పవచ్చును.

శ్రీ అట్లూరి పిచ్చేశ్వరరావు, లల్లన్, ఆలూరి భుజంగరావు, చావలి రామచంద్రరావు, యన్.యస్.వి.సోమయాజులు మొదలైనవారు ప్రేమచందు రచనలను ఆంధ్రీకరించిన వారిలో ప్రముఖులు.

సుప్రసిద్ధ హిందీ నవలా రచయితలయిన జయశంకర్ ప్రసాద్, జైనేంద్రకుమార్, కిషన్ చందర్ రచనలను శ్రీ ఛాయేశ్వర్ అనువదించారు. మనోవిశ్లేషణ ప్రధానంగా నవలలు రచించిన శ్రీ ఇలాచంద్రజోషి నవలలు కూడా తెలుగులోకి వచ్చాయి. కేంద్ర సాహిత్య అకాడమీవారు హిందీలోని కొన్ని ప్రసిద్ధనవలలను తెలుగులోకి అనువదింప చేశారు. వాటిలో చెప్పుకోతగ్గది ఆచార్య హజారీప్రసాద్ ద్వివేదీ గారి 'బాణభట్ట్‌కీ ఆత్మకథ'కు కీ.శే.ఏ.సి.కామాక్షిరావుగారి అనువాదం.

హిందీలోని ఛాయావాదం, రహస్యవాదం, ప్రగతివాదం తెలుగులోని భావ కవిత్వం, మర్మకవిత్వం, అభ్యుదయ కవిత్వ పోకడలలో ఎన్నో సామాన్య లక్షణాలు కనిపిస్తవి. కాని వాటిని పరస్పర ప్రభావం అని చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే రెండింటికి మూలం ఇంగ్లీషులోని రొమాంటిసిజమే, వంగభాషలోని రవీంద్ర కవిత్వమే. మచ్చుకి సమాన భావాలు కల కొన్ని కవితలను ఉట్టంకిస్తాను.

శ్రీ రామ్‌ధారీసింహ 'దినకర్' శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగార్లు రచించిన ఈ క్రింది కవితలలో భావసామ్యం గమనించ తగింది.

'సింధు క్యాసునూc. గర్జన్ తుమ్హారా
స్వయం యుగధర్మ్ కీ హుంకార్ హూc. మైcl
కఠిన్ నిర్ఘోష్ హూc. భీషణ్ అశనికా
ప్రలయ్‌గాండీవ్ కీ టంకార్ హూc మైcl

('హుంకార్'లో 'పరిచయ్' అనే కవిత)

'ఏను స్వేచ్ఛా కుమారుడ నేను గగన
పథ విహార విహంగమ పతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూ ప్రభంజన స్వామి నేను'.

(కృష్ణపక్షము)

శ్రీ సుమిత్రానందన్ పంత్, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఈ క్రింది కవితలలోని భావసామ్యం పరిశీలించ తగింది.

'ఛోడ్ ద్రుమోంకీ మృదుఛాయా
తోడ్ ప్రకృతి సేభీ మాయా
బాలే ! తేరే బాల్-జాల్‌మేc.
కైసే ఉల్ ఝూదూc లోచన్,
భూల్ అభసే ఇన్‌జగ్‌కో ।'
'ఆకులో నాకునై, పూవులో బూవునై
కొమ్మలో గొమ్మనై, నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా ?
ఇట్లైన
నిచటనే యాగిపోనా? (కృష్ణపక్షము)

ఆత్మ-పరమాత్మల సంబంధాన్ని అనేక విధాలుగా వర్ణించే శ్రీ సూర్యకాంత్ త్రిపాఠీ 'నిరాలా', శ్రీ నాయని సుబ్బారావుగారి క్రింది కవితలలో భావసామ్యం గమనార్హం.

తుమ్ తుంగ హిమాలయ శృంగ్
ఔర్‌మైఁ. చంచల్ గతి సుర-సరితా,
తుమ్ విమల హృదయ ఉచ్ఛ్వాస్
ఔర్ మైఁ కాంత కామినీ కవితా,
తుమ్ ప్రేమ్ ఔర్ మై శాంతి
తుమ్ సురాపాన ఘన్ అంధకార్
మైఁ హూఁ మత్‌వాలీ భ్రాంతి ।
తుమ్ యశ్‌హెూ, మైఁ హూఁ ప్రాప్తి,
తుమ్ కుంద్-ఇందు అరవింద్ శుభ్ర
తోమైఁ హూఁ నిర్మల్ వ్యాప్తి' ।

('అపరా'లో 'తుమ్ ఔర్ మై' అనే కవిత)

త్రిభువనమ్ములలో రసోద్దీపనమ్ము
వెల్లివిరియించు ప్రణయరూపిణివి నీవు
నీ దరస్మితరోచిః ప్రసాదకాంక్ష
కొనలుసాగిన ముగ్ధ భిక్షుకుడ నేను.
అమృతమునకు మాధుర్యమ్ము లలవరించు
కలశవారాశివీవు నీ యలల లేత
పులకరింపుల నునుజలువలకు మురియు
నెదరువేచిన బాలచంద్రుడ నేను
నీవు జీవన ధాత్రివి నేను జీవి
నీవు లేకున్న నాలేమియే ధ్రువమ్ము.

('సౌభద్రుని ప్రణయ యాత్ర'లో నీవు-నేను అనే కవిత)

దేశమాతకై సర్వస్వం త్యాగంచేసే పుణ్యపురుషుల పవిత్ర పాదధూళి స్పర్శకై తపించే పుష్పకామనను చిత్రీకరిస్తూ శ్రీ మాఖన్‌లాల్ చతుర్వేది రచించిన కవితకు శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారి కవితలో భావసామ్యం పరిశీలించ తగింది.

'చాహ్ నహీం, మై సురబాలాకే
గాహనోం మే గూంథా జాఊం।
చాహ్‌నహీం ప్రేమీ మలామేం
బింధ్ ప్యారీకో లల్‌చాఊం।
చాహ్ నహీ సమ్రాటోంకీ శవ్‌పర్
హేహరి, డాలాజాఊం।
చాహ్ నహీం, దేవోంకీ సిర్‌పర్
చఢూం భాగ్యపర్ ఇఠ్ లాఊం।
ముఝే తోడ్‌లేనా వనమాలీ ।
ఉన్ పథ్‌మేం దేనా తుమ్ ఫేంక్,
మాతృభూమి పర్ శాన్ చఢానే
జిస్ పథ్ జావేం వీర్ అనేక్' ॥
'నాకు తలంపు లేదు లలనాజనతా కబరీభరైక
భూషా కలనన్, సతీమృదు భుజాంతర తల్ప
కుచోప గూహ బిబ్బోకమునన్, వధూజన
కపోల గళ శ్రవణావతంస హేవాకమునన్
నీచపు దాస్యవృత్తి మన నేరని శూరత
మాతృదేశ సేవాచరణమ్మునం
దసువు లర్పణ సేసినవారి పార్థివశ్రీ
చెలువారుచోట, తదసృగ్గుచులన్ వికసించి
వాసనల్ వీచుచు రాలిపోవగ వలెం
తదుదాత్త సమాధి మృత్తికన్'.

('వైతాళికులు'లో 'కాంక్ష' అనే కవిత)

శ్రీమతి సుభద్రాకుమారి చౌహాన్ 'ఝకరాదోయా ప్యార్ కరో' శ్రీదువ్వూరి రామిరెడ్డి **గారి** 'నైవేద్యం' లోను, శ్రీ సుమిత్రానందన్ పంత్ 'మౌన్ నిమంత్రణ్' శ్రీ

కృష్ణశాస్త్రి గారి 'ఎవరహెూ' లోను, శ్రీ సోహన్‌లాల్ ద్వివేదిగారి 'యుగపురుష్' శ్రీ బసవరాజు అప్పారావుగారి 'గాంధీప్రభ' లోను ఎంతో భావసామ్యం గుబాళిస్తుంది. అయితే ఒకే యుగంలో, ఒకేరకమైన కావ్యప్రవృత్తులు ఉబుకుతున్న సమయములో ఇలాంటి భావసామ్యం కనబడడంలో ఎటువంటి ఆశ్చర్యం లేదు. కాని ఈ భావసామ్యాన్ని పరస్పర ప్రభావం అని చెప్పడానికి వీలులేదు.

కాని హిందీ భాషా సాహిత్యాల అధ్యయన-అధ్యాపనల మూలకంగా హిందీ-తెలుగు, తెలుగు-హిందీ అనువాదాలుచేసే వారేకాకుండా, స్వయంగా హిందీ భాషలో రచనలు సాగించి, ప్రఖ్యాతి వహించిన ఆంధ్రులు పలువురున్నారు. నవల, కథ, కవిత్వం, ఏకాంకికలు మొదలయిన అన్ని రంగాలలో ఆంధ్రులు తమ ప్రతిభాముద్ర వేశారు. సంకుచిత మనస్తత్వానికి అతీతులైన ఆంధ్రులు సంస్కృతం తరవాత హిందీ భాషా-సాహిత్యాలకు అద్వితీయమైన సేవ చేశారు.

హిందీలో నవలలు, నాటికలు వ్రాసి పేరెన్నికగన్న వారిలో శ్రీ ఆరిగెపూడి రమేశచౌధరీ ప్రథమగణ్యులు. వారు ఇప్పటికి దాదాపు 20 నవలలు, అనేక నాటికలు, కథలు వ్రాసారు. 'దూర్ కే ఢోల్', 'పతితపావనీ', ధన్య భిక్షు', 'ఉధార్‌కే పంఖ్' మొదలయిన నవలలు, 'భగవాన్ భలాకరే', 'బంద్ ఆంఖే' మొదలయిన కథాసంకలనాలు, 'నేపథ్య', బిజ్లీ ఔర్ బారిష్' మొదలయిన ఏకాంకికా సంకలనాలు పాఠకలోకాన్ని ఎంతో అలరించాయి. రమేశచౌధరీ గారి రచనలు ఇతర భాషలోకి అనువదించబడ్డాయి.

శ్రీ బాలశౌరిరెడ్డి గారు హిందీలో నవలలు రచించడమే కాక, పరిచయాత్మక, తులనాత్మక విమర్శప్రధానమైన వ్యాసాలు చాలా వ్రాశారు. అనువాదాలు కూడా చాలా చేశారు. 'బారిష్టరు', 'లకుమ', 'భగ్నసీమాయే', 'జిందగీ రాహ్', 'శబరీ' మొదలయిన నవలలు, 'సత్యకీ ఖోజ్' అనే ఏకాంకికా సంకలనం ప్రచురించబడ్డవి. 'పంచామృత్', 'ఆంధ్రభారతీ' అనే పుస్తకాలలో రెడ్డిగారు తెలుగు సాహిత్యంలోని ఉత్కృష్ట రచనలు హిందీవారికి పరిచయం చేశారు.

శ్రీ బి.వి.సుబ్బారావు గారు 'హరికిశోర్' అనే పేరుతో కవితలు, కథలు వ్రాశారు. 'ఉఫాన్' అన్నది వారి ప్రసిద్ధ నవల. ఆ మధ్యనే వారి కావ్యసంకలనం 'మేరి కావ్య సాధన' అనే పేరుతో ప్రచురించబడ్డది.

హిందీ కావ్య జగత్తులో శ్రీ వారణాసి రామమూర్తి 'రేణు' గారు సుప్రసిద్ధులు. 'విహగ్‌కే గీత్' వారి కావ్యసంకలనం. 'తెలుగుకే కబీర్ వేమన్న' అనే గ్రంథంలో వేమన్నను సమగ్రంగా వారు హిందీ వారికి పరిచయంచేశారు. 'ఆదాన్ ప్రదాన్' అనే వ్యాస సంకలనంలో తులనాత్మక పరిశీలనా ప్రధానాలయిన వ్యాసాలు కూర్చబడ్డవి. ఈ రంగంలో 'రేణు' గారు ప్రథములు, ప్రముఖులు. ఆకాశవాణి ద్వారా 'రేణు' గారి రూపకాలు ఎన్నో ప్రసారమయినవి.

ప్రొఫెసరు జి.సుందరరెడ్డిగారి ఆలోచనాత్మకాలయిన వ్యాసాలు 'సాహిత్య ఔర్ సమాజ్', 'మేరే విచార్' అనే పుస్తకాలుగా ప్రచురించబడ్డవి. హిందీ ఔర్ తెలుగు-ఏక్ తులనాత్మక అధ్యయన్' అనే పుస్తకంలో వారు హిందీ తెలుగు సాహిత్య ప్రవృత్తులను తులనాత్మకంగా పరిశీలించారు. 'దక్షిణ్‌కీ భాషాయేఁ తథా సాహిత్య'లో దక్షిణ భారతదేశ భాషా సాహిత్యాల సమగ్ర పరిచయం చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయ హిందీ శాఖాధ్యక్షులైన శ్రీ రెడ్డిగారు హిందీ భాషా సాహిత్యాలకు విశిష్టమైన సేవ చేస్తున్నారు.

డా. చావలి సూర్యనారాయణమూర్తి గారు కవిగాను, నాటక కర్తగాను ప్రసిద్ధి చెందారు. 'సతీ ఊర్మిళ', 'మానస్‌లహరీ' అనే కావ్యాలు కాకుండా మూర్తిగారు రచించిన కవితలు పత్రికలలో ప్రచురించబడుతూ ఉంటవి. 'సమఝౌతా' అనే సాంఘిక నాటకం, 'మహానాశ్‌కీం జోర్', 'సత్యమేవ జయతే', అనే పౌరాణిక నాటకాలే కాక అనేకంగా రేడియో నాటకాలు కూడా వ్రాశారు. హిందీ-తెలుగు సాహిత్యాలలో గల రామకథా సాహిత్యాన్ని తులనాత్మకంగా పరిశీలిస్తూ మూర్తిగారు రచించిన పరిశోధనా గ్రంథం వారి విమర్శాపాటవానికి మచ్చు తునక.

ఆంధ్రదేశంలో హిందీ ప్రచారానికి ఎంతో కృషి చేసిన శ్రీ యస్.వి.

శివరామశర్మ గారు హిందీ-తెలుగు వ్యాకరణాలను తులనాత్మకంగా పరిశీలిస్తూ, ఉత్తమ గ్రంథాన్ని వెలువరించారు.

దక్షిణభారత చరిత్ర ఆధారంగా శ్రీచోడవరపు రామశేషయ్యగారు 'బొబ్బిలి', 'గృహిణి', మంత్రి రామయ్య', 'రాణీ మల్లమ్మ', 'రాణీ కణ్ణకీ' అనే నాటకాలు రచించారు.

శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి గారు తెలుగు బుర్రకథ పద్ధతిలో 'నాగార్జునసాగర్' అనే బుర్రకథ హిందీలో వ్రాసి పండితుల మెప్పు పొందారు. అనువాదాలే కాకుండా, వారు తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేస్తూ అసంఖ్యాకంగా వ్యాసాలు కూడా వ్రాశారు.

శ్రీ ఆలూరి బైరాగిచౌధరి గారు హిందీలో చక్కటి కవిత్వం వ్రాశారు. 'పలాయన్', 'బదలీకీ రాత్' అనే కవితా సంకలనాలను ఆయన ప్రచురించారు.

డా॥ ముట్నూరి సంగమేశం గారు 'విశ్వామిత్ర' అనే పుస్తకాన్ని ప్రచురించారు.

ప్రొఫెసరు యస్.టి.నరసింహాచారి గారి పరిశోధన గ్రంథమైన 'సాహిత్యిక్ అభిరుచి తథా సమీక్ష' అనే గ్రంథం పండితుల మెప్పు వడసింది. ఇదికాక 'ప్రసాద్‌కీ కహానీయాఁ: ప్రకృతిమూలక్ విశ్లేషణ్', 'సౌందర్య తత్త్వనిరూపణ్' అనే గ్రంథాలు కూడా చెప్పకోదగ్గవి.

డా. ఇలపావులూరి పాండురంగారావు గారు సుప్రసిద్ధులైన కవులు, రచయితలు హిందీలో డాక్టరేటు పట్టం పొందిన ప్రథమాంధ్రులు డా. పాండురంగారావు గారు. తెలుగు-హిందీ రూపకాలను తులనాత్మకంగా విమర్శిస్తూ వారు పరిశోధన గ్రంథం వ్రాశారు. సుప్రసిద్ధ హిందీ మహాకావ్యమయిన 'కామాయనీ'కి వారి చక్కని తెలుగు అనువాదం ఆ మధ్యనే ప్రచురింపబడింది. శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరుల ఆదేశం ప్రకారం 'కామాక్షి విలాసం' అనే హిందీ కావ్యం రచించి 'కవిరత్న' అనే సార్థక బిరుదనామం పొందారు రావుగారు.

శ్రీ పురుషోత్తమ కవిగారి హిందీ రచనలను, హిందీ వారికి పరిచయం

చేసిన సదవకాశం ఈ గ్రంథప్రణేతలలో ఒకరైన 'నిర్మల్' గారికి దక్కింది. తెలుగు లోని చక్కని రచనలను హిందీ వారికి, హిందీ సాహితీ సౌరభాలతో తెలుగువారికి పరిచయం చేయడానికి ఇతోధికమైన కృషిచేసారు.

డా.కర్లరాజ శేషగిరిరావు గారు 'ఆంధ్రకీ లోకకథాయేఁ' అనే పుస్తకంలో తెలుగు జానపద గాథలు, హిందీలో వ్రాశారు. 'భౌరోంకా పహాడ్' రాజశేషగిరిరావు గారి ఏకాంకికల సంకలనం.

హిందీలో పరిశోధన వ్యాసాలు వ్రాసి డాక్టరేటు పట్టం పొందిన ఆంధ్రులు దాదాపు 40 మంది ఉన్నారు. వీరిలో చాలామంది హిందీలో సుప్రసిద్ధ రచయితలు. అనువాదాలు చేసి, విమర్శ ప్రధానమైన వ్యాసాలు వ్రాసి హిందీ సాహిత్య ప్రపంచంలో పేరొందిన ఆంధ్రులు ఎంతోమంది ఉన్నారు. గ్రంథవిస్తర భీతిచే వారి సాహితీ కృషిని సవివరంగా ఇక్కడ పేర్కొనలేక పోతున్నందుకు చింతిస్తున్నాము.

ఢిల్లీ, వారాణాసి, భువనేశ్వర్, ఆలీగఢ్, గోరఖ్‌పూరు, పూనా, లక్నో మున్నగు నగరాలలో కాక హరియాణా రాష్ట్రంలో తెలుగుభాషాధ్యయన-అధ్యాపనాలకు అనువైన అవకాశాలు ఉన్నవి. హరియాణా రాష్ట్రంలో తెలుగుభాషా ప్రచారం భారత ప్రభుత్వ త్రిభాషా సూత్రానికి అనుగుణ్యంగా రూపుదిద్దుకొన్నది. ఆ ప్రాంతంవారు తెలుగు భాషలోని అందచందాలను తమ మాతృభాష హిందీలోనికి అవతరింప చేసుకొనే శుభావసరం కోసం, తెలుగు భాషాభిమానులు నిరీక్షించవచ్చును.

విదేశాలనుండి అరబ్బీ-పారసీలు మాతృభాషలుగా కలిగిన ముస్లిములు రెండు మార్గాలగుండా మన దేశంలో ప్రవేశించారు. నౌకా వ్యాపార సంబంధాల మూలకంగా అరబ్బులు 7-8 శతాబ్దులలో పడమటి తీరం నుండి దక్షిణ భారతదేశంలో ప్రవేశించారు. వీరి మాతృభాష, వ్యవహారభాష అరబ్బీ. మనదేశంపై దండయాత్రలు చేసిన ముస్లిములు హిందూకుష్ పర్వతం కనుమల ద్వారా భారతదేశంలో ప్రవేశించారు. అయితే వీరి వ్యవహార భాష, సాహిత్యభాష ఫారసీ. ఆ రోజుల్లో ఫారసీ-శౌరసేనీ అపభ్రంశ భాషల సమ్మేళనంతో (హిందూ-ముస్లిం సమ్మిశ్రణం

వలన) ఒకకొత్త భాష ఉద్భవించింది. ఆ భాష ప్రారంభదశలో తన జన్మస్థానంలో కాకుండా, దక్షిణ భారతదేశంలో పెంపొంది, సాహిత్యరచనకు ఎక్కువగా ఉపయోగపడింది. ఆ తరవాత మళ్ళీ ఆ భాష ఢిల్లీ-లక్నోలు చేరుకొని రెండు శతాబ్దాలపాటు సాహితీ రంగంలో ఏకచ్ఛత్రాధిపత్యాన్ని వహించింది.

దక్షిణ భారతదేశంలో ఈ భాషకు దక్షినీ, రేఖ్తా అని పేర్లు ఏర్పడ్డాయి. కొంతమంది రచయితలు దీన్ని హిందవీ, హిందుయీ అనికూడా అన్నారు. ఉత్తర భారతదేశంలో ఈనాటి సాహిత్య భాష అయిన ఖడీబోలీతో దీనికి ఎక్కువ సంబంధం ఉంది. అందుచేత ఖడీబోలీ హిందీకీ, ఉర్దూ భాషకూ దక్షిణ భారతంలోనే శ్రీకారం చుట్టబడిందని భాషాభిజ్ఞుల అభిప్రాయం.

ఈ భాషకు అరబ్బీ-పారసీలతో మిక్కుటంగా సంబంధం ఉండడంతో, ఆంధ్రదేశంలో అరబ్బీ-పారసీ భాషల ప్రాచుర్య ప్రాభవాలను గురించి కూడా కొద్దిగా తెలుసుకోవాలి.

ఖండాంతరాలలో వలసరాజ్యాలు స్థాపించుకున్న ఆంధ్రులకు నౌకాయాన సందర్భంలో అరబ్బులతో వ్యాపార సంబంధాలు ఏర్పడ్డవి. అందుచేత నౌకలకు, నౌకాయాత్రలకు సంబంధించిన అనేక అరబ్బీ పదాలు తెలుగులో ప్రవేశించాయి. అయితే వాటి రూపం ఎంతగా మారిపోయిందంటే, ఈనాడు వాటిని అరబ్బీ భాషా పదాలని గుర్తుపట్టడానికి వీలులేకుండా పోయింది. అరబ్బులకు, తెలుగువారికి ఏర్పడ్డ ఈ సంబంధం నౌకా జీవనానికి మాత్రమే పరిమితమైంది. ఈనాడు తెలుగునాటి సముద్రతీర ప్రాంతాలలోని నావికుల భాషలో వ్యవహరించ బడుతున్న పదాలు, సంస్కృత, ప్రాకృత, ద్రావిడ భాషలకు కాక అరబ్బీ, తుర్కీ భాషలకు సంబంధించినవని కీ.శే. చిలుకూరి నారాయణరావు గారు నిరూపించారు.

ముస్లిములకు అరబ్బీ ధార్మిక భాష-మత వ్యవహారాలకు సంబంధించిన భాష-కావడంతో, కొన్ని అరబ్బీ పదాలు ఫారసీ ద్వారా తెలుగులో చేరి ఉండవచ్చును.

14వ శతాబ్ది ప్రారంభంనుండే, రాజ్యవిస్తరణ కాంక్షతో మహమ్మదీయులు

ఢిల్లీ చక్రవర్తుల ఆదేశానుసారంగా, అర్ధశతాబ్ది లోపల తెలుగుదేశంలోని ప్రధాన మండలాలను ఆక్రమించుకున్నారు. బహమనీరాజ్య సంస్థాపనతో అరబ్బీ-ఫారసీ భాషలకు రాజపోషణ కూడా లభించింది. ఆనాటి మహమ్మదీయులకు వ్యవహార భాషగా ఉన్న ఫారసీ పాలకుల భాష కావడంతో, తెలుగువారిపై ప్రగాఢ ప్రభావం చూపింది. ప్రభుత్వ అధికారులతో సంబంధంకల తెలుగువారికీ, రాజాశ్రయాన్ని అభిలషించే తెలుగువారికీ పారసీ భాష నేర్చుకోవడం తప్పనిసరి అయిపోయింది. సమకాలీనులయిన తెలుగు వారి కావ్యాలలో అనేక ఫారసీ పదాల ప్రయోగం ఈ విషయాన్ని నిరూపిస్తున్నది.

ఫారసీకి రాజభాషా గౌరవం లభించడంతో, పరిపాలన వ్యవస్థకు సంబంధించిన అనేక పదాలు, పదబంధాలు తెలుగు భాషలో చేరి మమైకం అయిపోయినవి. కబురు, చొక్కా, రోజు, సరిహద్దు, దర్బారు, మసీదు, మజా, అత్తరు, హెూదా మొదలయిన పదాలకు మూలం ఫారసీభాష అని ఆపదాలు వాడే వారిలో ఎంతమందికి తెలుసు?

ఆ విధంగా ఫారసీ నుండి వచ్చిన కొన్ని పదాలకు అర్థాలలో మార్పు వచ్చింది. ఉదాహరణకు:

	ఫారసీ రూపం, అర్థం	**తెలుగు**
(ఖా) కామందు	ఖావింద్, భర్త	భూస్వామి
ఫౌజులు	ఫౌజ్, సైన్యం	సమూహం
తాలీంఖానా	తాలీంఖానా, విద్యాలయం	వ్యాయామశాల
తనఖా	తన్ఖా, జీతం	తాకట్టు
ముద్దాయి	ముద్దయీ,	
కులాసా	ఖులాసా, వివరం	కుశలం

తెలుగు పద్యరచనలో కూడా ఫారసీ ఛందోరీతులు, అంత్యాను ప్రాసల

ప్రభావం కనిపిస్తుంది. కావ్య రచనలో అరబ్బీ-ఫారసీ పద సమ్మిళితమైన మణి ప్రవాళశైలి కూడా ఉపయోగించబడింది. ఉదాహరణకు

1. ఆండాళుగారు మిమ్మర్చించు హరఖ్తు,
   నీ పూజ సేయడే నేకుబఖ్తు.
2. నాకలోకము నీకు దీవాన్‌ఖానా
   నిగమ పదార్థము నీకు ఖజానా.
3. తెలిసి జేసైతి ఖదీంనుండి కోషీషు
   పాతవైకట నేడు బిల్పరేజు.[1]

మొదటి దశలో హిందువులకు, ముసల్మానులకు మధ్య వ్యవహార భాషగా ఉన్న శౌరసేనీజన్యమైన ఉర్దూ భాష ఎందరికో మాతృభాషగా రూపొందింది. ఇది దక్షిణ భారతదేశంలో-ముఖ్యంగా తెలంగాణం, కర్నాటకం, మహారాష్ట్రం (పూర్వ హైదరాబాదు సంస్థానంలోని ప్రాంతాలు) - దక్షినీ భాషగా వ్యవహృతమయి, ఆధ్యాత్మిక రచనలకు, సూఫీ సిద్ధాంత ప్రచారానికి సాధనమయింది. ఈ భాష నేటి ఖడీబోలీ హిందీ, ఉర్దూలకు మూలమని భాషా శాస్త్రజ్ఞుల సిద్ధాంతం. దక్షినీలో గోల్కొండ సుల్తాను అయిన మహమ్మద్ కులీ కుతుబ్‌షా రచించిన 'కుల్లియాత్' అనే 1800 పేజీల కవితా సంకలనం చాలా ప్రసిద్ధి చెందింది. ఆ సంకలనంలో కులీకుతుబ్‌షా తరచుగా హిందీ శబ్దాలు, హిందీ రూపాంతరం పొందిన ఫారసీ శబ్దాలు, అక్కడక్కడా తెలుగు శబ్దాలు వాడారు. అంతవరకు ఆధ్యాత్మిక విషయాలకే పరిమితమైన దక్షినీ భాషలో కులీ కుతుబ్‌షా హిందూ-ముస్లిముల ఆచార వ్యవహారాలను, రమణీయ ప్రాకృతిక దృశ్యాలను కావ్యవస్తువులుగా స్వీకరించి రచన సాగించాడు.

గోల్కొండ కుతుబ్‌షా పరిపాలనా కాలంలో వజహీ, గవాసీ, ఇబన్ నిషాతీ, గులాంఅలీ, తానాషా, తబయీ అనే వారు దక్షినీ భాషలో సుప్రసిద్ధ కవులు. 1630 ప్రాంతంలో పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి' రచించాడు. 1659లో గవాసీ దక్షినీ

1. తెలుగుపై అరబ్బీ-పారీకుల ప్రభావము-డా॥ కె.గోపాలకృష్ణరావు

భాషతో 'తూతీనామా' రచించాడు. 'తూతీనామా', శుకసప్తతి'లలో చాలా సామ్యం కనిపిస్తున్నదని దక్షినీభాషా–సాహిత్యాలను గంభీరంగా తరచి, పరిశోధించిన డా.శ్రీరామశర్మగారు వ్రాసారు.

ఈ దక్షినీ యొక్క పరిష్కృత రూపమే ఉర్దూ. ఈ పరిష్కారం అరబ్బీ–ఫారసీ భాషా–సాహిత్య సంప్రదాయాలను అనుసరించి జరగడంతో, ఉర్దూ భాషా–సాహిత్య సంప్రదాయాలపై ఆయా ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది.

గోల్కొండ రాజ్య పతనానంతరం, ఆసఫ్‌జాహీల కాలంలో కూడా దక్షినీ రచనలకు ప్రోత్సాహం లభించింది. ఔరంగాబాదు శాసకుడయిన వలీఉల్లా 'వలీ' అనే పేరిట చక్కటి రచనలు చేశాడు. వలీకి దక్షినీ (రేఖ్తా) భాషకు ఢిల్లీకి తీసుకు వెళ్లిన గౌరవం దక్కింది. అక్కడ ఆ భాషను 'ఉర్దూ' అని వ్యవహరించారు. ఉర్దూలో గద్యరచనకు శ్రీకారం చుట్టినవాడూ వలీయే.

1890 ప్రాంతాలలో హైదరాబాదులో ఉర్దూ రాజభాషగా వ్యవహృతం కాసాగింది. ఆ తరవాత ఉస్మానియా 'విశ్వవిద్యాలయ స్థాపనానంతరం, ప్రభుత్వోద్యోగాల నాశించేవారు, ఉన్నత విద్యాభ్యాసం చేయగోరేవారు తప్పనిసరిగా ఉర్దూ నేర్చుకోవలసి వచ్చింది. దానిచే సామాన్య జన వ్యవహారానికి ఉర్దూతో పరిచయం కలిగి ఉండడం అవసరమైంది. తెలంగాణం నడిబొడ్డున ఉన్న హైదరాబాదు ఉర్దూకు ప్రధాన కేంద్రం కావడంతో, తెలుగు భాషా సాహిత్యాలపై ఉర్దూ భాష, సాహిత్య సంప్రదాయాల ప్రభావం పడడం సహజమే కదా !

పరిపాలనా విధానంతోనూ, ప్రభుత్వంతోనూ పరోక్షంగాను, ప్రత్యక్షంగాను సంబంధం ఉన్న గ్రామాధికారులు, వకీళ్ళు, అధికారులు తమ మాతృభాష తెలుగే అయినా ఉర్దూ–పారసీ భాషలలో మంచి పాండిత్యాన్ని గడించి, నాటి రాజకీయ, ప్రజాజీవితాలతో ఎంతో పలుకుబడిని సంపాదించుకున్నారు. వారు స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో చైతన్యం జాగరితం చేయడానికి ఉర్దూ భాషను సాధనంగా వినియోగించుకున్నారు. అయితే ఉర్దూ–ఫారసీ భాషలలో తెలుగువారు

సాహిత్య సృష్టి చేసిన సందర్భాలు క్వాచిత్కంగానే ఉన్నా, అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో తెలుగువారు ఉర్దూ ఫారసీ భాషల ద్వారా సాధించిన సిద్ధులు చెప్పుకోతగ్గవే. అటు ప్రభుత్వాన్ని, ఇటు అక్షరాస్యులయిన ప్రజలను ఉర్దూ భాషా పాండిత్యం ద్వారా ప్రభావితం చేయడానికి వారు ప్రయత్నం చేశారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఉర్దూలో పత్రికా రచయితలుగా, పత్రికా నిర్వాహకులుగా వన్నె కెక్కిన ఆంధ్రులలో శ్రీమందుముల నరసింగరావు ('రయ్యత్'), బండారు శ్రీనివాసరావు ('రహనుమా'), వెంకట లక్ష్మారెడ్డి (ముహిబ్బెవతన్'), లక్ష్మినారాయణ ('షరారే') ప్రభృతులు చెప్పుకోతగ్గవారు. దోమకొండ సంస్థానాధీశ్వరులయిన రాజేశ్వరరావు గారు ఉర్దూ-హిందీ, హిందీ-ఉర్దూ నిఘంటువులే కాక, మహాభారత, రామాయణాలను చక్కటి ఉర్దూ గద్యంలో అనువదించారు. వారు ఉర్దూలో దాదాపు 35 రచనలు చేశారట. వారు ఉర్దూ సామెతల సంకలనం కూడా తయారు చేశారు.

ఉర్దూలో కవిత్వం చెప్పిన ఆంధ్రులు పలువురున్నారు. వారిలో పల్లెర్ల శ్రీనివాసరావు 'ఫక్ర్', కొడంగల్ వాస్తవ్యులయిన జకీ, వరంగల్లు వాస్తవ్యులైన కాళోజీ రామేశ్వరరావు 'షాద్', ఉదయగిరి శేషగిరిరావు మొదలయిన వారు పేర్కొనదగ్గవారు. 1930లోనే ఫక్ర్‌గారు 'బేతాజ్ బాద్‌షా' (మకుటం లేని చక్రవర్తి) అనే శీర్షికన నెహ్రూ పండితుణ్ణి వర్ణించిన కవిత పలువురి ప్రశస్తి పొందింది. పల్లెర్ల హనుమంతరావుగారు ఉర్దూ గద్యరచనలో సిద్ధహస్తులు. జనార్దనరావు దేశపాండే చక్కటి ఉర్దూలో రచనలు సాగించారు.

హరికథా పితామహులయిన ఆదిభట్ల నారాయణ దాసుగారు కూడా ఉర్దూ-ఫారసీ భాషలు చక్కగా నేర్చుకొని, ఆయా భాషలలో రచనలు సాగించారట. వారు మణిప్రవాళ శైలిలో రచించిన సీసపద్యమొకటి 'ఆంధ్ర రచయితలు' అనే గ్రంథంలో ఉట్టంకించబడింది.

పీఠికాపుర వర్ణనము

భ్రాజతే కుక్కుటేశ్వర మాధవాలయాభ్యాం
ఘనారూఢ సౌధాంతరేణ
హాసిల్ హమీష జహాన్‌తాజ్ నమూన
బహిష్మత్తుసాపిర్చి హిరిసాల
రావునూర్యారావు రాజా బహద్దర్ది
చారిట బిల్రూల్రౌ జెంట్స్ ఎరెవ్రి
చదువుల పుట్టిల్లు చల్వతెమ్మర జల్లు
మేల్నొల్లు పొగడిక మీరజెల్లు
మేటిపంటల టెంకి కల్మిమెడలంకి
బెష్టు టే నిన్గొడావరీ యీస్ట్ దిసీజె
మర్చుపీర్వ జవాన్ జవాల్ మీర్జనాన
పీఠికాపురమేవ త్రివిష్టప మిహ[1] !

ఉర్దూ రచనలను తెలుగులో అనువదించిన వారిలో శ్రీ దాశరథి, సదాశివ మొదలగువారు పేర్కొనదగిన రచనలు చేశారు. డా. కె. గోపాలకృష్ణరావుగారు ఉర్దూ-ఫారసీలను గురించి, తెలుగులో చక్కటి గ్రంథం వెలయింపచేశారు.

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు డా. జీనత్ సాజిదాతో కలిసి తెలుగు వాఙ్మయ చరిత్రను 'తారీఖే తెలుగు అదబ్' అనే పేరిట రచించి, తెలుగు సాహిత్య మకరందాన్ని, ఉర్దూ భాషీయులకందచేశారు.

అచ్చ తెలుగులో కావ్యరచన చేయించి, ఆ కృతులను స్వీకరించిన గౌరవం కుతుబ్‌షాహీ సుల్తానులకు, వారి సామంతులకు దక్కింది.

అద్దంకి గంగాధరకవి (16వ శతాబ్దం) 'తపతీ సంవరణోపాఖ్యానము' అనే కావ్యాన్ని 'ఇభరాముడు', 'మల్కిభరాముడు' అని ప్రసిద్ధి కెక్కిన ఇబ్రహీమ్ కులీ కుతుబ్‌షాకు (1550-1580) అంకితం. చేశాడు. ఈ సుల్తాను తెలుగు భాషతో

1. ఆంధ్ర రచయితలు : శ్రీ మధునాపంతుల సత్యనారాయణగారు.

చక్కని పరిచయం కలిగిఉండి, తెలుగుకవులకు, సాహిత్యపరులకు ఆశ్రయం ఇచ్చాడు, ఆసూరి మరింగంటి సింగరాచార్యులు 'దశరథరాజ నందన చరిత్ర' యను నిరోష్ఠ్య కావ్యం రచించి, ఇబ్రహీమ్‌కు అంకితం చేశాడు.

పొన్నగంటి తెలగనార్యుని 'యయాతి చరిత్ర' కు కృతిపతి అమీన్‌ఖాను, ఇతను ఇబ్రహీంషా సర్దారులలో ఒకడు, పొట్లచెరువునకు గ్రామాధిపతి 'యయాతి చరిత్ర' అచ్చ తెలుగుకావ్యాలలో ఆదికావ్యమై, తరవాతి వానికి ఒరవడి పెట్టినది.

ఇబ్రహీం తృతీయపుత్రుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా 'మానీ' అనే కవితా నామంతో ఫారసీ-ఉర్దూ భాషలు రెండింటిలో రచనలు చేశాడు. ఈతనికి తెలుగుభాష యందు ప్రవేశముండి, తెలుగులో కూడా కవితలు అల్లినట్లు చరిత్రకారులు వ్రాశారు.

కూచిపూడి నృత్య కళారీతుల వైశిష్ట్యాన్ని గుర్తించి, కూచిపూడి కళాకారులను సత్కరించిన, సమాదరించిన ప్రభువు గోల్కొండ నేలిన అబుల్ హసన్ కుతుబ్‌షా.

ఆధునిక యుగంలో మెహిఉద్దీన్, చాంద్‌బీబీల గర్భవాసాన జనించిన ఉమర్ అలీషా (1885-1945) తెలుగు భాషలో పాండిత్యం గడించి, తెలుగులో కవిత్వం వ్రాసి పేరొందిన ముస్లిములలో అగ్రగణ్యులు. తమ 14వ ఏటనే ధారాళంగా కవిత్వం చెప్పారు. మాతృభాష ఉర్దూ అయిననూ తెలుగుభాషలో సరసంగా కవిత్వం చెప్పి రసికులను మెప్పించిన సమర్థులు. వీరు రచించిన తెలుగు గ్రంథాలు ఏబదివరకు ఉన్నవి.

ఆంధ్రప్రాంతంలో వ్యవహారంలో ఉండడంతో, ఉర్దూ (వాడుక) భాషా సాహిత్యాలపై, ఉచ్చారణ, పదాలు, పదబంధాలు, వాక్యనిర్మాణం, సామెతలు మొదలయిన వాటిపై తెలుగుభాష ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది.

కరేపాక్ (కరివేపాకు), కుప్ప, చెప్పల్, కట్ట, దొర, బొట్టు, చిర్‌దండీ (చిరుతిండి), చిల్లర్, పుట్టీ, పడ్తల్ (పడుదల, బేరం సానుకూలపడడం), దండ్ (దండగ), చక్కాదహీ (చెక్క పెరుగు), పక్కాపండు (బాగాపండినంపడు), గంపా-గుత్తా

(మొత్తంగుత్తా contract), మదం, ఎట్టీ (వెట్టి), బువ్వ మొదలయిన పదాలు, చెంబూహెూనా (దండగకావడం), కుప్పాహెూనా (వ్యర్థంకావడం లేక పాడయి పోవడం) మొదలయిన పదబంధాలు ఉర్దూ భాషలో నిత్యవ్యవహారంలో ఉన్నవి.

చెమార్‌కే దేవ్‌కో చెప్పల్‌కీ పూజా (మాదిగదేవుడికి చెప్పులతోపూజ అనగా ఎటువంటి వాడికి అటువంటి విధంగానే బుద్ధిచెప్పాలి), ఖానేకోనహీ, ఎల్లీకో బులారహేహై. (తింటానికిలేదు, ఎల్లిని రమ్మంటున్నాడు అనగా మింగడానికి మెతుకులేదు, మీసాలకు సంపెంగనూనె అని భావం) లాంటి సామెతలు కూడ ప్రచారంలో ఉన్నవి.

ఉర్దూ వాక్య నిర్మాణంలో కూడా తెలుగువాక్య నిర్మాణ ప్రభావం కనడపుతుంది. 'చెప్పమని చెప్పాడు' అనడానికి ఉర్దూలో', 'బోల్కే బోల్తేహై' అని, 'కావలెనని (రావలెనని) రాలేదు' అనడానికి 'హెూనాబోల్కెనహీం ఆయా' అని 'ఊరికే కూర్చో' అనడానికి 'చుప్కేబైఠో' అని వాడుతున్నారు. తెలుగు వాక్య రచనా ప్రభావంతో వచ్చిన ఇటువంటి వాక్యరచన దక్కిని ఉర్దూలోను, వ్యావహారిక ఉర్దూలోనూ వ్యవహారంలో ఉన్నది.

దక్షిణాదిరాష్ట్రాలన్నింటిలోకి ఆంధ్రరాష్ట్రంలో హిందీకి వ్యతిరేకత లేకపోవడానికి, హిందీభాషా ప్రచారానికి ఆనుకూల్యం ఏర్పడి ఉండడానికిగల ముఖ్య కారణాలలో ఉర్దూభాషా పరిచయమొకటని చెప్పాలి. పరిష్కృతమయిన హిందీలో–గ్రంథరచన ఉపయోగపడుతున్న హిందీభాషలో–సంస్కృతపదాలు పెచ్చు, సంసస్కృతం వైపు మొగ్గుహెచ్చు. తెలుగుభాషలో సంస్కృత శబ్ద బాహుళ్యం ఉండనే ఉన్నది. దానికితోడు ఉర్దూభాషలో కొద్దో-గొప్పో పరిచయం కలిగి ఉండడం చేత, ఆంధ్రులు హిందీభాషను అతి త్వరలో నేర్చుకోగలరు. ఈ మధ్య నాగపూర్‌లో జరిగిన విశ్వహిందీ సమ్మేళనంలో పాల్గొన్న వారిలో ఉత్తరప్రదేశ్ తరవాత ఆంధ్రప్రదేశ్ నించివచ్చిన ప్రతినిధులసంఖ్యయే ఎక్కువ.

అనేక కారణాలవల్ల ఏర్పడ్డ పరస్పర సంబంధ బాంధవ్యాలతో తెలుగు భాషా

సాహిత్యాలకు, ఉత్తరభారతభాషా సాహిత్యాలలో అన్నింటికంటె, హిందీ-ఉర్దూ సాహిత్యాలతో ఏర్పడ్డ పరస్పర ప్రభావం చెప్పుకోతగ్గది. హిందీ-ఉర్దూల తరవాత ఉత్తర భారతభాషలలో తెలుగుసాహిత్యంపై ఎక్కువ ప్రభావం చూపించిన భాష బెంగాలీభాష. బంకిచంద్ర ఛటర్జీ, పాంచకడీదేవ్. శరత్‌బాబు ప్రభృతుల నవలల తెలుగు అనువాదాలు, విశ్వకవి రవీంద్రుని రచనలకు తెలుగు అనువాదాలు, శాంతినికేతనంలో అధ్యయనం మొదలయినవి తెలుగువారి భావప్రపంచాన్ని అత్యధికంగా ప్రభావితం చేశాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వెంకట పార్వతీశ కవుల 'ఏకాంతసేవ' ను గురించి వ్రాస్తూ శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారు 'వంగభాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మన యాంధ్రమున కీ మహాకవుల-భక్తుల యేకాంతసేవ యట్టిది' అని అన్నారు. తెలుగులో వచ్చిన భావకవిత్వానికి, మర్మకవిత్వానికి రవీంద్ర భావాంజలియే మూలమని చెప్పవచ్చును. కథలలో, నవలలో మధ్యతరగతి వారి సమస్యలు, సమాజంలో స్త్రీ సంబంధమయిన సమస్యల చిత్రణపై శరత్ నవలల ప్రభావం నిర్వివాదం.

మనకు తెలుగులో గ్రాంథిక, వ్యావహారిక భాషాభేదం ఉన్నట్లుగానే బెంగాలీలో సాహిత్య, కథ్య భాషాభేదం ఉన్నది.

బెంగాలీ భాషలో మన బొబ్బిలికథవంటి 'చౌధరీల్ లడాయీ' చాలా ప్రసిద్ధి వహించింది.

ఆధునిక యుగంలో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించి సంఘ సంస్కరణో ద్యమాన్ని ప్రభావితం చేసినవి వంగదేశంలో ఉద్భవించిన బ్రహ్మసమాజం లాంటి ఉద్యమాలే. పాలపర్తి నరసింహంగారు 'భక్తాంజలి' అనే పేరిట బ్రహ్మసమాజ ప్రసంగాలను అనువదిస్తే, మన్నవ బుచ్చయ్య పంతులు 'ఇండియన్ రిఫార్మర్' అనే పత్రిక స్థాపించి, బ్రహ్మమత ప్రచారం చేశాడు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఈ సంఘసంస్కరణోద్యమానికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకున్న విషయం నలుగురు ఎరిగినదే. వీరేశలింగంగారి శిష్యులలో ఆదిపూడి సోమనాథరావు మొదట్లో

బ్రహ్మసమాజ ప్రచారంచేసి, ఆ తరవాత ఆర్యసమాజంలో చేరి, స్వామి దయానంద రచించిన 'సత్యార్థ ప్రకాశిక' ను తెలుగు చేశారు.

బెంగాలు విభజన, జాతీయోద్యమంగామారి, భారతదేశంలోని ప్రతిరాష్ట్రాన్ని ప్రభావితంచేసిన సంగతి చరిత్రప్రసిద్ధం. శ్రీ ముట్నూరికృష్ణారావుగారు బెంగాలు వెళ్ళి, అక్కడి పరిస్థితులను స్వయంగాచూచి, ఆ ఉద్యమం ఆంధ్రదేశంలో కూడా వ్యాపిస్తే బాగుంటుందని భావించారు. 1907లో బిపిన్‌చంద్రపాల్‌గారి ఆంధ్రప్రదేశ్ పర్యటనతో సమస్త ఆంధ్రదేశంలో ఆ ఉద్యమం వ్యాపించింది. ఆ ఉద్యమ ఫలితంగా ఏర్పడ్డదే బందరులోని జాతీయకళాశాల.

బెంగాలునుంచి జాతీయకళాశాలకు ప్రమోద కుమారచట్టోపాధ్యాయ అనే చిత్రకారుడు వచ్చాడు. అడవి బాపిరాజు, దామెర్ల రామారావు ప్రభృతులయిన చిత్రకారులంతా ఆయనకు సాక్షాత్తుగాగాని, పరంపరగాగాని శిష్యకోటిలోని వారు.

ఈ జాతీయోద్యమం, జాతీయ విద్యోద్యమం కాలక్రమాన ఆంధ్రోద్యమంగా పరిణమించినవి. జాతీయోద్యమ ప్రభావంవల్ల పట్టాభిసీతారామయ్య. కళా వెంకట్రావు, యన్. జి. రంగా, దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల ప్రభృతులు యావద్భారత ప్రశస్తి గడించుచున్నారు.

ఆంధ్రదేశానికి చెందిన హొలియ (Holia) అనే గ్రామంలో 1607లో జన్మించిన శివరాముడనే యోగీశ్వరుడు రామానంద సరస్వతి అనే పేరుతో, వంగదేశంలో ప్రఖ్యాతి వహించారు. ఆయన శిష్యులు-ప్రశిష్యులు 'తైలంగ మిషను' అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి, వారి ఉపదేశాలను ప్రచారం చేస్తున్నారు. 1975, జనవరి 24 నుండి 27 తేదీలలో త్రైలంగస్వాములవారి 369వ జన్మ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

పంచద్రావిడులలో ఒకరైన మహారాష్ట్రులు, ప్రాచీన ఆంధ్రదేశ చరిత్రలో

ప్రముఖస్థానం కలిగి ఉన్నారు. హాల సాతవాహనుడు తననాటి ప్రాకృతాన్ని రాజభాషగా గౌరవించాడు. దీనినే తర్వాతివారు మహారాష్ట్రీ ప్రాకృతమన్నారు. గాథాసప్తశతిలో ఆంధ్రజీవనమే వర్ణించబడ్డది. కనుకనే ఎన్నో తెలుగుపదాలు గాథాసప్తశతిలో చేరాయని తిరుమల రామచంద్రగారన్నారు[1].

పుట్టపర్తి నారాయణాచార్యులుగారన్నట్లు "నేటి మరాఠీకి" 'మహారాష్ట్రీ' ప్రాకృతమే మూలభాష. కనుక ఆ వాఙ్మయమునకు పురుడుతీర్చిన అదృష్టము పూర్తిగా కాకున్నను సగపాలునకు పైగా మనది".

మహారాష్ట్ర దేశంలో పాండురంగనికున్న మహత్త్వము మరో దేవునికి లేదు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి పాండురంగడు విద్యానగరాన్ని కూడా బాగా ఆకర్షించాడు. రాయలు పండరియాత్ర కూడా చేశాడట. అళియరామరాజు తన భక్తితో పాండురంగని విద్యానగరానికి తీసుకువచ్చాడని, కవిభక్తుడయిన ఏకనాథుని ముత్తాత అయిన భానుదాసుడువచ్చి విఠలుణ్ణి వెనక్కు తరలించి తీసుకోపోయాడని అంటారు. పండరినాథునిపట్ల తెలుగువారికున్న ఈ అభిమానం, భక్తిప్రపత్తులు 'పాండురంగ మాహాత్మ్యం' లో కన్పిస్తవి.

'దాన విశ్రామధామ' అనే మరాఠీ గ్రంథంలో మహాకవి పోతన కథ కూడ వర్ణించబడి ఉన్నది.

శివాజీకి గురువైన సమర్థ రామదాసు ఆంధ్రుడని కొంతమంది మహారాష్ట్ర పండితుల అభిప్రాయం. ఆయన శిష్యుడయిన ఉద్ధవగోస్వామి ఆంధ్రుడని ప్రతీతి.

శివాజీకాలంలో ఆంధ్ర మహారాష్ట్ర దేశాలకు బాగా సంబంధాలు ఏర్పడ్డవి. ఆంధ్రదేశంలోకాక దక్షిణదేశంలో రాజ్యంచేసిన మహారాష్ట్ర భూపతులు తెలుగుకవులను పోషించడమేకాక స్వయంగా తెలుగులో రచనలుచేశారు. తంజావూరు నేలిన అభినవభోజుడుషాహజీ మహారాజు ఆంధ్రభాషకుచేసిన సేవ అవిస్మరణీయం కదా

---

1 గాథాసప్తశతిలో తెలుగుపదాలు-భారతి, 1948. మార్చి. (సర్వధారి, చైత్రం): Telugu words in Gatha Saptasati-Summary of Papers, Intenational Orientalists, Conference. New Delhi-1965.

! ఆయన ఆ స్థానంలో సంస్కృతాంధ్ర తమిళకవులు చాలామంది ఉండేవారట !

శివాజీ కాలంలో మన బుర్రకథలవంటి 'పవాడాలు' లేక 'పువ్వాడాలు' మహారాష్ట్ర దేశంలో బాగా ప్రచారంలోకి వచ్చినవి.

కాకతీయుల ఇలువేల్పయిన ఏకవీరాదేవిని ఏకనాథుడు ప్రస్తుతించాడు.

ఆధునికయుగంలో ఎన్నో మరాఠీ రచనలకు తెలుగు అనువాదాలు వచ్చినవి. హిందూవీరుల సాహసకృత్యాలని, చరిత్రలో హిందూ స్వర్ణయుగాన్ని చాటే కథలు మరాఠీ ప్రభావంతో తెలుగులో వచ్చాయి. వీరసావర్కారు రచించిన 'భారత ప్రథమ స్వాతంత్ర్యయుద్ధం' ఆంధ్రులను ఉత్తేజపరచిన రచన.

మరాఠి నవలలను ఆంధ్రీకరించినవారిలో వాసుదేవరావు. యస్. జగన్నాథ్. పి.వి. నరసింహారావు ప్రముఖులు.

మరాఠీలో మౌలికంగా రచనలుచేసిన వారిలో కీ.శే. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు గణనీయులు. వారు మరాఠీలో దాదాపు 150 వ్యాసాలు వ్రాశారు. మోపవంతు మరాఠీలో రచించిన మహాభారతాన్ని పరిష్కరించి ప్రచురించారు. వారు 'మహారాష్ట్రేతిహాసిక పరిశోధక మండలితో వాదించి, నాసికవద్ద ఉన్నది. పంచవటి కాదనీ, భద్రాద్రివద్ద ఉన్నదే సిసలయిన పంచవటి అనీ నిరూపించారు.

'సీతారామాంజనేయ సంవాదము' నే వేదాంత గ్రంథాన్ని రచించిన పరశు రామవంతుల లింగమూర్తిగారు ఆంధ్రదేశంలో స్థిరపడిపోయిన మహారాష్ట్ర వంశసంజాతులు.

కాళోజీ, హర్కారే అనే ఇంటి పేర్లు గలవారు తెలుగుదేశంలో స్థిరపడిపోయిన మహారాష్ట్రులు. కాళోజీ, నారాయణరావుగారు ఆధునిక తెలుగు కావ్య జగత్తులోను ప్రసిద్ధులు.

ఈ శతాబ్ద ప్రారంభంలో ప్రకాశానందస్వామి అనే ఆంధ్రుడు గుజరాతు

ప్రాంతంలో చాల ప్రసిద్ధికెక్కాడు. 'వార్తాలాపం', అనే పేరిట ఆయన ప్రవచన సంకలనాలు అచ్చు అయినవి.

తెలుగువారు ఇతర ప్రాంతాలకు, ఇతరదేశాలకు వెళ్ళి, అక్కడ స్థిరపడిపోయి, అక్కడి వారితో కలిసిమెలిసి పోయారు.

కంసుని ఆస్థానంలో ఉండి శ్రీకృష్ణునితో ముష్టియుద్ధం చేసిన చాణూర ముష్టికులు ఆంధ్రులేనట. కాని ఇలా ఇతర ప్రాంతాలలో స్థిరపడిపోయిన తెలుగు వారికి ఆంధ్రప్రాంతంలో సంబంధ బాంధవ్యాలు లేకపోవడంతో, వారు ఆంధ్రులని తెలియకుండా పోతున్నది. రాజస్థాన్‌లో 'స్వామి' అన్న పేరుగల వారి పూర్వీకులు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో జ్యోతిష్కులకు, ఉత్తరప్రదేశ్‌లో సైనికులకు, పోలీసులకు, పంజాబులో వస్తాదులకు తెలంగాలు అనిపేరట. బహుశ వీరి పూర్వీకులు తెలుగువారై ఉండవచ్చు. కాశీలో సుప్రసిద్ధ వీర శైవపీఠం స్థాపించిన చిదిరేమఠం వీరభద్రశర్మగారు తెలుగువారు.

కాశీలోని వ్యాకరణ పండితులలో సుప్రసిద్ధులయిన శేషంవారు తెలుగువారే.

ఈ విధంగా ఇతర ప్రాంతాలలో స్థిరపడి, యావద్భారత కీర్తి వహించిన ఆంధ్రులలో సి వై. చింతామణి, వారి పుత్రుడు సి. బాలకృష్ణరావు, కుమార్తె శ్రీమంతి డాక్టర్ మోహినీరావు, కోటంరాజు రామారావు, నాయుడమ్మ, సి. కె. నాయుడు, విజ్జి, ప్రభృతులు ప్రఖ్యాతులు.

యల్లాప్రగడ సుబ్బారావు. సూరి భగవంతం, కోడి రామమూర్తి, మోటూరి సత్యనారాయణ, వేమూరి ఆంజనేయశర్మ, డా. ఇలపావులూరి పాండురంగారావు, యస్. రాధాకృష్ణన్, వి.వి. గిరి మొదలయిన ఆంధ్రులు తమ ప్రతిభావైదుష్యాలతో సమస్త దేశాన్ని ప్రభావితం చేసినవారు.

ఈ ప్రకారంగానే ఇతర ప్రాంతాల నుండి కూడా ప్రజలు వచ్చి ఆంధ్రదేశంలో

స్థిరపడిపోయారు. మన రాష్ట్రంలో బొందిలీలు అనబడేవారు 'బుందేల్ ఖండ్' నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయారు. పంతులవారు, వఝులవారు, పండావారు, చతుర్వేదులవారు, ద్వివేదులవారు, ఇతర ప్రాంతాలనుండి వచ్చి ఆంధ్రదేశంలో స్థిరపడిపోయిన వారని కొంతమంది అభిప్రాయం.

✦ ✦ ✦

ముగింపు మాట

భారతదేశంలో ఎన్నో భాషలు ఉన్నవి ! వాటిలో కొన్నిటిలో సమృద్ధమయిన వాఙ్మయం ఉంది, వాఙ్మయరచన జరుగుతున్నది. ఈ భాషలు మాట్లాడే వారిని ఏకసూత్ర నిబద్ధం చేసింది సంస్కృతం. అయితే అది సాంస్కృతిక మయిన సమైక్య భావం. ఆంగ్లేయులు వచ్చిన తరవాత దేశంలో రాజకీయమయిన సమైక్యం ఏర్పడింది. ఈ కారణాలుగా భారతీయ భాషలలోని సాహిత్యాలలో మొదటినుంచి సమానమయిన సాహిత్య ప్రవృత్తులు కనిపిస్తవి.

దైనందిన జీవితానికి భాషకు సన్నిహిత సంబంధం ఉండితీరాలి. అప్పుడే భాష కొత్త చివుళ్ళను వేస్తుంది, కొత్త సౌరభాలను గుబాళిస్తుంది. దేశప్రజలంతా ఒకే రాజ్యాంగానికి బద్ధులయిన, ఒకే ఆదర్శ శిఖరాన్ని అందుకోవడానికి మహోద్యమాన్ని నిర్వహిస్తున్నపుడు పరస్పర భావసమ్మేళనం. పరస్పర భాషా సమ్మేళనం సహజంగానే జరుగుతవి. ఈ సందర్భంలో భాషల పరస్పర ప్రభావం అని వార్యమయి పోతుంది.

తెలుగువారు కవితాప్రియులు. దేశంలోనేకాదు, జగత్తులో ఎక్కడనైనాసరే, కొత్తదేదైనా కనిపిస్తేసరి, తెలుగువాళ్ళు దాన్ని సొంతం చేసుకునేందుకు పరవళ్ళు తొక్కుతారు. కొంగ్రొంత్త రుచులను ఆస్వాదించాలనే కుతూహలంతో ఎన్నో కొత్తవేషాలను కొత్తరుచులను, కొత్త సాహిత్య ప్రక్రియలను, కొత్త ఆచారాలను అలవరచుకుంటారు. ఈ అలవాటే తెలుగువాణ్ణి అధునాతన పౌరునిగా తీర్చి దిద్దుగలుగుతున్నది.

భారతీయ భాషల పరస్పర ప్రభావం, ఒక మహా స్రవంతిలా నిండుగా గంభీరంగా, కూలంకషంగా, నిన్నటిదాకా నిరర్గళంగా ప్రవహిస్తూ వచ్చింది. భారతీయులంతా ఆ పునీత నదీజలాల్లో స్నాతులయి, ఆరోగ్యాన్ని సంపాదిం

చుకోగలరు. ఈ భాషలు సమైక్య భావానికి, అవరోధాలుగా కాక, సుమసేతువులుగా వర్ధిల్లినవి.

భారతదేశం విభక్తం కావడం భారతీయుల మనస్సులను కలచివేసింది. ఈ విభజనతో ఆగక, భాషాప్రయుక్తంగా దేశ పునర్విభజన కావడం, పరిపాలన దృష్టితో ఎంతవరకు సముచితమో చెప్పలేముకాని, దేశీయుల మనస్సులను సంకుచిత పరచడంలో తోడ్పడుతున్నదేమో అనే అనుమానానికి తావిస్తున్నది. నదీజలాల విషయంలో, కొన్ని ప్రాంతాల విషయంలో ఇంకా వివాదాలు కొనసాగుతూనే ఉన్నవి. ఉద్యోగాలు, బోధనభాష మొదలయిన జాతీయ ప్రాముఖ్యంకల విషయాలలో, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం గిరిగీసుకొని, రకరకాల శాసనాలను అమలు పరచుకుం టున్నది. దేశంలోని మేధావులంతా కూడి దేశీయ సమస్యలను సమాలోచిం చుకునేందుకు వీలయిన భాషను పెంపొందించుకునేందుకు మారుగా, మేధావులంతా తమతమ ప్రాంతీయ భాషలకే తమ తెలివితేటలను పరిమితం చేసుకుంటున్నారు. ఇతర భాషలపట్ల నిన్న ఉన్న సమరసభావం, సహనశీలత నేడు కనిపించడంలేదు. ప్రాంతీయతత్త్వాలు, భాషలను ప్రాతిపదికగా చేసుకొని, విచ్ఛిన్న ధోరణులు విజృంభిస్తూ ఉండడం సమైక్య భావ ప్రసరణానికి ఎంతో ప్రమాదకరంగా కనిపిస్తున్నది. సాంస్కృతికంగా ఒకటిగా ఉన్న భారతీయులు రాజకీయాల దాడికి విడిపోవడం, తమ శక్తియుక్తులను నిరర్థకం చేసుకోవడమే కాగలదు.

తెలుగుతనం భారతీయతలో ఒక భాగం. తెలుగు భారతీయుల మణిహారంలో ఒకమణి. ఒక సమైక్య శక్తిలో భాగంగా తెలుగు, తెలుగు ప్రజలు దేశాభ్యుదయానికి కృషిచేయగలరని, వారి భాషాసాహిత్యాలు, చరిత్ర రుజువు చేస్తున్నవి. రాజకీయాలు మనస్సులను విడదీస్తే, సాహిత్యం హృదయాలను కలుపుతుందనే యథార్థాన్ని ఈ మా పరిశీలన దిఙ్మాత్రంగా నైనా తెలుపగలిగితే, మా కృషికి కృతార్థత చేకూరు తుందని ఆశిస్తున్నాము.

✦ ✦ ✦

పరామర్శ గ్రంథాలు

1. Contemporary Indian literature : Sahitya Akademi, New Delhi.
2. Literature in Modern Indian language-Edited by Dr. V. K. Gokak.
3. హిందీ సాహిత్యకోశ్ (మొదటిభాగం) సం : డా. ధీరేంద్రవర్మ.
4. దక్షినీ హిందీ కా సాహిత్య - డా. శ్రీరామశర్మ.
5. తెలుగుపై ఉర్దూ, పారసీకముల ప్రభావం - డా. కె. గోపాలకృష్ణారావు.
6. తెలుగు వాఙ్మయము సంగ్రహచరిత్ర - సం. కె. వి. గోపాలస్వామి.
7. తెలుగు భాషీ హిందీ నాటక్‌కార్ పురుషోత్తమకవి - డా. భీమసేన్ 'నిర్మల్'.
8. National Integration Publication Series : The Institute or Indo-Middle East culutural studies, Hyderabad.
9. ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము : కె. వెంకటనారాయణరావు.
10. శివరాత్రి మాహాత్మ్యము : సం. డా. బి. రామరాజు.
11. సారస్వత నవనీతము : దేవులపల్లి రామానుజరావు.
12. మాధ్యమ్ (ఆంధ్ర విశేషాంక్) - సం: సి. బాలకృష్ణరావు.
13. అఖిలభారత తెలుగు సాంస్కృతి వారోత్సవముల ప్రత్యేక సంచిక.
14. విజ్ఞాన సర్వస్వము - మూడవ భాగము.
15. విజ్ఞాన సర్వస్వము-ఆరవ భాగము.
16. నవ్యాంధ్ర సాహిత్యవీథులు - కురుగంటి సీతారామయ్య.

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

* తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారుచేయడం.
* ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
* తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యలు చేపట్టడం.
* తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
* తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
* తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
* తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం

తెలుగు సంస్కృతి ప్రకాశం

దేశ భాషలందు తెలుగు లెస్స